కెఎన్.రాజన్ మృతి పట్ల సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ- క్లాక్‌టవర్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కెఎన్.రాజన్ (79) సోమవారం ఉదయం సికింద్రాబాద్, బోయగూడలోని వారి స్వగృహంలో మృతిచెందారు. ఆయన మృతిపట్ల సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది. కుటుంబ సభ్యులకు పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కెఎన్.రాజన్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ వ్యవహారాల ఇన్‌చార్జిగా 4 దశాబ్దాల పాటు పనిచేశారని పేర్కొన్నారు. ఏకే గోపాలన్ ,ఈఎంఎస్ , బీటీఆర్, సూర్జీత్, నాయకత్వంలో ఉన్నప్పుడు ప్రధాన బాధ్యతగా పార్టీ వ్యవహారాలను చూసేవారని గుర్తు చేశారు. ఆయన భార్య ఆశాలత అఖిలభారత మహిళా సంఘంలో రాష్ట్ర నాయకురాలుగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. వారి కుటుంబమంతా పార్టీ కోసమే పనిచేస్తున్నదని పేర్కొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ తనిఖీ

నవతెలంగాణ -పెద్దవూర



మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ నిల్వలు, పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు.ఆసుపత్రి పరిధిలో గర్భిణుల వివరాల నమోదు, ఓపీ తదితర విషయాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. అనంతరం పీఎం జన్ మన్ ప్రోగ్రాం లో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్ ను ప్రారంభించి మాట్లాడారు.ఈ మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా గిరిజన తండాల్లోతిరుగుతూ కావాల్సిన హెల్త్ చెకప్ చేస్తారని తెలిపారు. అదేవిధంగా స్టాఫ్ కి వివిధ ప్రోగ్రాంల గురించి రివ్యూ మీటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీ ఎం హెచ్ ఓ గీతావాణి, వైద్యాధికారి నగేష్, డాక్టర్ హిమ వర్షిత, సీహెచ్ఓ శ్రీనివాస్, సూపర్ వైజర్లు సువర్ణ కుమారి, జయకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

ఓటర్ నమోదుకు 19,111 దరఖాస్తులు

- మిగిలింది ఇక ఒక రోజు
- అందరి చూపు నల్లగొండ వైపు



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం మార్చి29.2025 పూర్తి కానుంది. దీంతో ఆ స్థానం ఎన్నికల నిర్వహణకు ఓ జాబితా రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకటించింది. దీంతో ఓటర్ల నమోదు క్రమం సెప్టెంబరు 30 నుంచి ప్రారంభం కాగా.. ఈ నెల 6 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. ఈ నెల 23న ముసాయిదా జాబితా ప్రకటించి.. ఈ జాబితాపై అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 25వరకు అభ్యంతరాలు పరిష్కరించి అదే నెల 30న ఓటరు తుది జాబితా విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో 12 జిల్లాలు 191 మండలాల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కుఫారం 18, 19 ద్వారా నమోదు చేస్తున్నారు. నాలుగో తేదీ వరకు 19111 ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

వచ్చిన దరఖాస్తు లు ఇలా...

సిద్దిపేట జిల్లాలో నాలుగు మండలాల గాను 128, నల్లగొండ 33 మండలాల పరిధిలో 3886, సూర్యాపేట 23 మండలాల పరిధిలో 2201, యాదాద్రి భువనగిరి జిల్లా 17 మండలాల పరిధిలో 874, జనగాం జిల్లా పరిధిలో 12 మండలాల్లో 645, మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాకు988, వరంగల్ జిల్లా పరిధిలో 13 మండలాల్లో 18 18, హనుమకొండ జిల్లాలో 11 మండలాకు చెందిన 3664, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏడు మండలాల్లో 196 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాల గాను 1496 మంది, ఖమ్మం జిల్లాలో 21 మండలకు గాను 2873, ములుగు జిల్లాలో 9 మండలాలకు గాను 342 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 191 మండలాల్లో19111 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

మిగిలింది ఇక ఒక రోజు

నల్లగొండ, ఖమ్మం ,వరంగల్ పాత ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం డిసెంబర్ 6 చివరి తేదీ కావడంతో ఇక మిగిలింది ఒక్కరోజు మాత్రమే. ఇప్పటికే యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్ని మండలాల్లో పర్యటిస్తూ అర్హులైన ఉపాధ్యాయులను ఓటు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. గతంలో కంటే ఈ దఫా ఎక్కువ ఓట్లు నమోదయ్యే అవకాశం ఉందని ఉపాధ్యాయ మేధావి వర్గం పేర్కొంటున్నారు.

అందరి చూపు నల్లగొండ వైపు

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఇప్పటికే యూటీఎఫ్ గతంలో ఎమ్మెల్సీగా ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరో అవకాశం ఇస్తూ ఇప్పటికే అభ్యర్థిగా ప్రకటించారు. పీఆర్టీయూ నుంచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుశ్రీపాల్ రెడ్డి ని ప్రకటించారు. మిగిలిన సంఘాలు త్వరలోనే అభ్యర్థులను ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఓటు నమోదు చేసుకొని తమకు మరో అవకాశం కల్పించాలంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విస్తృతంగా పర్యటిస్తున్నారు.దీంతో రాష్ట్రమంతా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఎవరిది ఉంటుందోనని అందరి చూపు నల్లగొండ వైపు ఉంది.

కమ్యూనిస్టులు నిజమైన త్యాగధనులు

- సీపీఐ(ఎం) దామరచర్ల మండల మహాసభలో జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ- మిర్యాలగూడ

కమ్యూనిస్టులు నిజమైన త్యాగధనులని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం దామరచర్ల మండలకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలోఎండి మక్బూల్ సాహెబ్‌నగర్‌లో ఆ పార్టీ మండల 8వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనాడు పదవుల కోసం ఆశపడకుండా ప్రజా సమస్యలే పరిష్కార ఎజెండాగా పోరాటాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఆస్తులను, ప్రాణాలను త్యాగం చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీ నాయకులకే దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు గ్రామస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మతం పేరిట రాజకీయం చేస్తూ రాజకీయ ప్రయోజనాలు మోడీ ప్రభుత్వం పొందుతుందని విమర్శించారు. ప్రజలకు దేశ సంపాదనను పంచాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ నాయకులు దోచిపెడుతూ కొల్లుగొడుతున్నాయని విమర్శించారు. ఒక దేశం ఒకే ఎన్నికల నిర్వహించాలని కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్ర హక్కులను కాల రాష్ట్రానికి కేంద్రం ఈ ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి ప్రజలపై భారాలు మోపుతున్నాయని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే విధంగా ఉద్యమాలు చేయాలని సూచించారు. పార్టీ నిర్మాణ పరంగా బలోపేతం చేయాలని కోరారు. కమ్యూనిస్టు కార్యకర్తలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని కోరారు. సమావేశాలు నిరణతరం నిర్వహించినారు. అనంతరం నూతన కార్యదర్శిగా వినోద్ నాయక్ ను ఎన్నుకున్నారు. ఏర్ర నాయక్, దయానంద్, ఖాజా మొయినోద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవి నాయక్,రాగిరెడ్డి మంగా రెడ్డి, శశిధర్ రెడ్డి, ఎండి అంజాద్, ఆయూబ్,మండల నాయకులు పాపా నాయక్,బి కోటి రెడ్డి, పి గోపి, దుర్గయ్య, ఎస్ కె సుబాని, మట్టయ్య, వెంకటయ్య,బి శ్రీను, విజయ్, శ్రీహరి, అంజయ్య, ఎస్ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత పథకాలపై దృష్టి కేంద్రీకరించాలి

- మిల్లర్లు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నవతెలంగాణ- నల్లగొండ కలెక్టరేట్

ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల పై అధికారులు ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రవేశపెట్టే నూతన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై జిల్లా అధికారులు మొదలుకొని, గ్రామస్థాయి వరకు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నదని, సంబంధిత శాఖల అధికారులు రైతులకు, మిల్లర్లకు ఎవరికీ ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఈనెల 6 నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకుగాను జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్టు తెలిపారు. ప్రజావాణిలో 45 మంది ఫిర్యాదులను సమర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు సకాలంలో అందించడం ద్వారా విద్యార్థి జీవితాల్లో మార్పు

షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు సకాలంలో పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు అందించడం ద్వారా వారి జీవితాలలో మార్పులు తీసుకురావచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదిత్య భవన్‌లో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలపై జారీచేసిన నూతన విధివిధానాల పై జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాల్స్, శాఖధిపతులకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పోస్ట్ మెట్రిక్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల జారీకై నూతన గైడ్ లైన్స్‌ను జారీ చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పోస్టుమెట్రిక్ విద్యను అభ్యసించే షెడ్యూల్ కులాల విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలను పెంచిన దృష్ట్యా, ఉపకార వేతనాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, విద్యార్థులకు సకాలంలో పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సి అభివృద్ధి శాఖ డిడి, జిల్లా పరిశ్రమల శాఖ జెడి కోటేశ్వరరావు, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నుండి రమణ రావు ఎల్డియం శ్రామిక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్, ఇండియన్ పోస్టల్ డిపార్ట్మెంట్ సీనియర్ మేనేజర్ శ్రవణ్ కుమార్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ నుండి వినయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలి

నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి : సామాజిక, ఆర్థిక, విద్య రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎన్యుమరేటర్లతో కోరారు. సోమవారం నల్గొండ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సుపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్ల శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై ఆమె స్పష్టతనిస్తూ ఇది జనగణన, కుల గణన కాదని చెప్పారు. కేవలం సమాచార సేకరణ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహమద్, తదితరులు హాజరయ్యారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ- కట్టంగూర్

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిజాయితీగా పని చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన, ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని దుగినెల్లి, కట్టంగూరు, ఐటిపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల తోపాటు కేజీబీవీ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు.అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకుల నమోదు గడువు తేదీ రెండు రోజుల్లో ముగుస్తున్నందున నమోదు చేయించుకొని వారు వెంటనే ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. శాసనమండలి సభ్యుడుగా గత ఐదున్నర ఏళ్లగా ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ వివిధ యాజమాన్యాల నిర్వహిస్తున్న పాఠశాలల సమస్యలకు పరిష్కారం కొరకు ఎన్నో పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. నల్లగొండ నుండి హైదరాబాదు వరకు నడక యాత్ర, తో పాటు ఎన్నో పోరాటాలు, నిరసన దీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు పేర్కొన్నారు. మండలిలో ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కొరకు కృషి చేసినట్లు చెప్పారు. మరొకసారి ఎమ్మెల్సీగా గెలిపిస్తే పెండింగ్ లోఉన్న సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తూ, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసి, పరిరక్షించుకునేందుకు నిజాయితీగా పనిచేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో టీఎస్ ఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మురళయ్య, మండల ప్రధాక కారదర్శి దేశపాక కృష్ణ, సీనియర్ నాయలు పుట్టరాములు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంబటి అంజయ్య, వెంకటరమణ, బద్రి నారాయణ,నీలాంబరి, వెంకటేశ్వర్లు, దుర్గ, జయమ్మ, సౌజన్య, కరుణాదేవి, లీలావతి, మంగ పాల్గొన్నారు

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయం

- ఎంపీ రఘువీర్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్న సీఎం రేవంత్‌రెడ్డిపై, మంత్రులపై, ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం దామరచర్ల మండలంలోని కల్లేపల్లి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 3న మిర్యాలగూడ పట్టణంలో జరిగిన బీసీ గర్జన సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై, ఎమ్మెల్యేలపై మల్లన్నకులాల వారీగా మాట్లాడుతూ కామెంట్లు చేయడం శోచనీయ మన్నారు. కాంగ్రెస్‌పార్టీ బీఫాంపై గెలిచి పార్టీ నేతలపైనే ఆయన దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్నగెలుపు కోసం తామంతా కృషి చేశామన్నారు. అందరు కలిసి అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేస్తేనే గెలుస్తారన్న విషయం విస్మరించి మాట్లాడడం సరికాదన్నారు. మల్లన్న వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటుందన్నారు. ఈ విధమైన వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు, పొరపచ్చాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రనరావృతం కాకుండా మల్లన్న జాగ్రత్తలు తీసుకోని పార్టీకి నష్టం లేకుండా చూడాలన్నారు.



దేవాదాయ భూముల ఆక్రమణ ఆపాలని వినతి

నవతెలంగాణ -చిట్యాల

మండలంలోని పెద్ద కాపర్తి గ్రామ శ్రీ తిరుమలనాథ స్వామి దేవాలయ భూముల ఆక్రమణ ఆపాలని కోరుతూ ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ పొట్లపల్లి చిన్న స్వామి గౌడ్ ,బిజెపి మండల అధ్యక్షులు పొట్లపల్లి నరసింహ గౌడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్ మాదిగ ,బీఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షులు మాచర్ల యాదగిరి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. దేవాలయ, ప్రభుత్వ భూములను దేవాదాయ,రెవెన్యూ శాఖ అధికారులు కుమ్మక్కై, గ్రామంలోని సర్వే నెంబర్ 201,202/2 , 201/ ప, 201/ప/1, 201/ప/1/1, 201/ప/1/2,కు సంబంధించిన 80 ఎకరాలు దేవాదాయ భూమి , 20 ఎకరాలు ప్రభుత్వ భూమికి తక్షణమే సరిహద్దులు నిర్ణయించి కాపాడాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్న సంబంధిత అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆ గ్రామ మాజీ వార్డు సభ్యులు ఏర్పుల దామోదర్, ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు ఏర్పుల రాకేష్ మాదిగ, గ్రామ యువ నాయకులు పొట్లపల్లి మహేష్ , మర్రి హరీష్ రెడ్డి, గ్రామ ప్రజలు,రైతులు తదితరులు ఉన్నారు.



శాస్త్రీయ దృక్పథం పెంపునకు చెకుముకి సంబరాలు దోహదం



- ఎమ్మెల్యే వేముల వీరేశం

నవతెలంగాణ-నకిరేకల్

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంచడానికి చెకుముకి సైన్స్ సంబురాలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. సోమవారం జెవీవీ నాయకులతో కలిసి చెకుముకి సైన్సు సంబరాల పోస్టర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికి సైన్సులో ప్రారంభించడం పెంచడానికి సృజనాత్మక శక్తిని వెలుగు తీయడానికి సంబరాల నిర్వహణ ఉపయోగపడుతుందన్నారు. జెవివి ప్రతినిధులు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలని కోరారు. సంబరాలలో పాల్గొనేందుకు 8,9,10 తరగతుల విద్యార్థులు అర్హులని, పాఠశాల స్థాయి ప్రశ్నపత్రం తో పరీక్ష ఉంటుందన్నారు. పాఠశాల స్థాయి నవంబర్ 7న, మండల స్థాయి 21న, జిల్లా స్థాయి 28న, రాష్ట్రస్థాయి డిసెంబర్ 14, 15, 16 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు కనుకుంట్ల విద్యాసాగర్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు గంగాధరి భద్రయ్య, శంకర్, జేవివి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వి. నగేష్, డివిజన్ నాయకులు కె. శ్రీనివాస్, సధాకర్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన డీఆర్‌డీఏ శేఖర్‌రెడ్డి



నవతెలంగాణ- మాడుగులపల్లి

మండలపరిధిలోని పాములపాడు, చిరుమర్తి, ఆగమోత్కూరు గ్రామాలలో సోమవారం ఇందిరా క్రాంతి పథకం ద్వారా కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వై శేఖర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం పాములపాడు గ్రామంలో అలుగుబెల్లి అరుణ ఏర్పాటు చేసుకున్న ధర్తీ కుటీర పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీఏ ద్వారా 18 లక్షల బ్యాంకు లోన్ తీసుకొని 30శాతం దర్తి కుటీర పరిశ్రమకు రూ.7 లక్షలు సబ్సిడీ వచ్చినట్లుగా తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గేదెలు, కోళ్ల షెడ్లకు ప్రభుత్వం లక్ష రూపాయల వరకు పూర్తి సబ్సిడీ లోన్లు ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి తిరుమల స్వామి, ఏపీఎం చంద్రశేఖర్, డీపీఎం మోహన్ రెడ్డి, ఏపీవో నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ పార్వతి పంచాయతీ కార్యదర్శులు నాగార్జున్ రెడ్డి,సైదులు,సీసీలు నాగయ్య, సైదులు సంఘ బంధం అధ్యక్షురాలు మణెమ్మ విఓఏ పావని,చిరుమర్తి అధ్యక్షురాలు ఎల్లమ్మ, విఓఏ సైదులు ఆగమోత్కూర్ అధ్యక్షురాలు ఉదయభాను, అశ్విని, సునీత, సువర్ణ, దుర్గమ్మ, జానకమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నల్లగొండ మండల మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ -క్లాక్‌టవర్



ఈనెల 6 న నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో నిర్వహించే సీపీఐ(ఎం) నల్లగొండ మండల 8వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి నల్పరాజు సైదులు కోరారు సోమవారం దొడ్డి కొమరయ్య భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలో ప్రజా సమస్యలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. మూడు సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని నూతన కమిటీని ఎన్నుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొండా వెంకన్న బొల్లు రవీందర్ కుమార్ పోలే సత్యనారాయణ కట్ట అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ .లక్ష్మీనారాయణ

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్



కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఐకేపీ విఓఏలకు రూ.18 వేల వేతనం అమలు చేస్తామని తమ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్.లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఐకేపీ విఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నల్లగొండ మండల సమాఖ్య కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సీసీ గీతకు వినతి పత్రం అందజేశారు. వీఓఏలకు 18 వేల వేతనం అమలు చేయాలని, ఉద్యోగులకు స్త్రీనిధి గ్రామ సంఘాల నుండి రావలసిన ఇన్సెంటివ్ రూ.3000 వెంటనే ఇవ్వాలని, జాబ్ చార్ట్ నిర్ణయించాలని, ప్రమాద బీమా సౌకర్యం 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11,12వ తేదీలలో కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే 48 గంటల దీక్షలో విఓఏలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం నల్లగొండ మండల నూతన కమిటీని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. అధ్యక్ష కార్యదర్శులుగా జిల్లపల్లి మంగ, కాసర్ల సువర్ణ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జిల్లపల్లి మంగ, కాసర్ల సువర్ణ, పబ్బతిరెడ్డి సంధ్య, జిల్లపల్లి సంతోష, చనగోని సంధ్య, కృష్ణవేణి, పద్మ, జనగాం కవిత, కే. మంగ, కే. కళ్యాణి, రాఘవాచారి, అలివేలు, శైలజ, కవిత, వి. పద్మ, రాజేశ్వరి, పార్వతమ్మ, బాకీ జానమ్మ ఉప్పుల శైలజ తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా పత్తి, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వినతి

నవతెలంగాణ -మునుగోడు



రైతులు పండించిన పత్తి , వరి ధాన్యం పంటలను ఎలాంటి షరతుల్లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ నరేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వం హంగు ఆర్భాటాలతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కాంటాలు వేయడంలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం పత్రికా ప్రకటనల వరకే పరిమితమయ్యాయన్నారు. అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంట తడిసి ముద్దవుతుంటే అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొనుగోళ్ల వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి వరికుప్పల ముత్యాలు, మండల కమిటీ సభ్యులు కట్ట లింగస్వామి, వీరమల్లు, ప్రేమ్ సాగర్, స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్



నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని అమరవరం గ్రామంలో అకాల వర్షంతో నేలకొరిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న రైతులకు అకాల వర్షాలు నిండా ముంచాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రెవిన్యూ అధికారులు క్షేత్రాయిలో పరిశీలన జరిపి నష్టపోయిన పంటల వివరాలను సేకరించి ఎకరాకు రూ.30 వేలు పరిహారమిచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. పంటల భీమా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, తేనె సీతారాములు, తోట సైదయ్య పార్టీ నాయకులు షేక్ ఖాసీం, షేక్ సైదా, అరవింద్, నరసింహారావు, బాల సైదులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని నెమలిపురి కాలనీలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గమనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా షీటీం ఏఎస్ఐ కృష్ణమూర్తి జిల్లా ఇన్‌చార్జి జ్యోతి మాట్లాడుతూ ఆడపిల్లలకు వాట్స్‌యాప్ గ్రూపులో మెసేజ్‌లు చేయవద్దని పెద్దవారి కంటే పిల్లలే ఎక్కువగా ఇంటర్నెట్ ఫోన్‌లు ఉపయోగిస్తున్నారని వారన్నారు. అలాగే సైబర్ నేరాలపై ఎక్కువగా తల్లిదండ్రులు విద్యార్థులు వీటివల్ల జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని వారన్నారు. గమనం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు అంకతి అనసూయ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు అనేక రూపాల్లో జరుగుతున్నాయని పేరెంట్స్‌కి ఫోన్ చేసి కొంత మంది సైబర్ నెరగాళ్లుమీ అబ్బాయి బ్యాగులో డ్రగ్స్ దొరికిందని పోలీసులు అరెస్టు చేశారని, ఫోన్లు చేసి వారిని ట్రాక్‌లో పెట్టి అనేక రకాలుగా మోసం చేస్తు లక్షల రూపాయలు వారి దగ్గర నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీ రాణి , పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ఖరీదైన బైకులే లక్ష్యంగా దొంగతనాలు
- 27 బైక్‌ల దొంగతనం కేసులు ఛేదించిన జిల్లా పోలీసులు
- 8 మంది దొంగల అరెస్టు: ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



నవతెలంగాణ-సూర్యాపేట

ఖరీదైన బైకులే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కోదాడ, మునగాల పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ వివరాలు వెల్లడించారు. జల్సాల కోసం డబ్బు సంపాదించడమే లక్ష్యంగా సూర్యాపేట జిల్లా, ఆంధ్రకు చెందిన 8 మంది దొంగల ముఠాగా ఏర్పడి కోదాడ, మునగాల మండలం పరిధిలో రోడ్లపై, ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్స్‌ను టార్గెట్ చేసి దొంగతనం చేసేవారు. దొంగతనం చేయగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు. కాగా పలువురు బైక్‌ల అపహరణపై పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే ఆధివారం సాయంత్రం కోదాడ పట్టణంలో హుజూర్ నగర్ ఫ్లై ఓవర్ దగ్గర కోదాడ పట్టణ సిఐ రాము అతని సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు వాహనాలపై హుజూర్నగర్‌కు చెందిన బారి నాగరాజ్, ఆంధ్రా రాష్ట్రం పల్నాడు జిల్లా, దాచేపల్లి మండలం, తంగెడ గ్రామానికి చెందిన గుంజి రామాంజనేయులు, షేక్ కాసినపల్లి బాష, గుంజి కృష్ణ, తమ్మిశెట్టి వెంకటేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా ఖరీదైన బైకులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. గతంలో కోదాడ పట్టణంలో రాయల్ ఎన్ఫీల్డ్, ఒక యూనికాన్ ఒక పల్సర్ బైక్‌ను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వీరిని విచారించగా పలు ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. మరొక నిందితుడు గోపాలకృష్ణ పరారి అయ్యాడు.

కాగా నాగరాజు సూర్యాపేట జిల్లా మట్టంపల్లి మండల పరిధిలోని మట్టపల్లి గ్రామంలో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తూ చాకచక్యంగా బైక్లను దొంగతనం చేసేవాడు. మట్టపల్లి ప్రక్కనే ఉన్న ఆంధ్రా ప్రాంత తంగెడ గ్రామానికి ఇతని వద్దకు గుంజి రామాంజనేయులు, షేక్ కాసినపల్లి బాష, గుంజి కృష్ణలు బైక్ రిపేర్ చేయించుకునే వారు. నాగరాజు దొంగిలించిన రాయల్ ఎన్ఫీల్డ్ బైకులను గుంజి రామాంజనేయులు, షేక్ కాసినపల్లి బాష, లకు అమ్మినాడు. వీరి మధ్య పరిచయం ఏర్పడడంతో బైక్ వైర్ కట్ చేసి బైక్ దొంగిలించడం నేర్చుకున్నారు. అప్పటి నుండి 5 గురు కలిసి బైక్ దొంగతనాలు చేస్తున్నారు. నాగరాజును కోదాడ టౌన్‌లో రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ దొంగతనం కేసులో అరెస్ట్ చేయగా ఇతనిపై గతంలో హైదరాబాద్ పరిధిలో 5 కేసులు ఉన్నాయి. వీరి నుండి 22 లక్షల విలువగల 21 బైక్స్ రాయల్ ఎన్ఫీల్డ్ 6, యూనికాన్ 7, పల్సర్ 5, హెచ్ఎఫ్ డీలక్స్ 2, షైన్ 1 బైక్‌లను సీజ్ చేసి 5 గురు నింధితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అదేవిధంగా మునగాల ఎస్సై ప్రవీణ్ తన సిబ్బందితో కలిసి ఆదివారం మధ్యాహ్నం ముకుందాపురం గ్రామ బస్ స్టేజీ వద్ద వాహనల తనిఖీ నిర్వహిస్తుండగా ఆంధ్రా రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలానికి చెందిన మెచ్చర్ల శ్రీను, అలుగుల తరుణ్, కొంక చిన్నూ లు ఒకే బైక్‌పై కోదాడ నుండి సూర్యాపేట వైపు వస్తుండగా వారిని ఆదుపులోకి తీసుకుని విచారించగా ముకుందాపురం గ్రామంలో పల్సర్ బైక్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. అలాగే కోదాడ పట్టణంలో 3 బైక్‌ల దొంగతనం, పెనుములూరు పిఎస్ పరిధిలో 1 బైక్, విజయవాడ 5వ టౌన్‌లో 1 బైక్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వీరిలో మెచ్చర్ల శ్రీను, తరుణ్, మరో స్నేహితుడు చిన్నులతో కలిసి ముకుందాపురం, కోదాడ ప్రాంతంలో బైక్స్ దొంగతనాలు చేసేవారు. ఈ రెండు కేసుల్లో భాగంగా కోదాడ పట్టణ కేసుకు సంబంధించి ఐదుగురు దొంగలను అరెస్టు చేసి వారి నుండి 21 కేసులలో 22 లక్షల విలువగల 21 బైకులు సీజ్ చేయగా మునగాల కేసుకు సంబంధించి ముగ్గురు దొంగలను అరెస్టు చేసి వారి నుండి 6 కేసుల్లో 3.1 లక్షల విలువగల 6 బైకులు సీజ్ చేయడం జరిగింది.మొత్తం 28 కేసుల్లో 25 లక్షల విలువగల 27 బైకులు సీజ్ చేసి 8 మంది దొంగల అరెస్టు చేసి రీమాండ్ తరలించినట్లు యస్పీ వివరించారు. ఈ కేసు ఛేదనలో బాగా పని చేసిన మునగాల యసై ప్రవీణ్ కుమార్, మునగాల పోలీస్ స్టేషన్ సిబ్బందిని, కోదాడ టౌన్ పిఎస్ టెక్నికల్ టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను, కానిస్టేబుల యల్లారెడ్డి, సతీష్‌లను, కేసు పర్యవేక్షణ చేసిన మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, కోదాడ డిఎస్పీ శ్రీధర్ రెడ్డిలను ఎస్పీ రివార్డ్స్ ఇచ్చి అభినందించారు. ఈ సమావేశంలో కోదాడ డిఎస్పీ శ్రీధర్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, కోదాడ పట్టణ సిఐ రాము, మునగాల సర్కిల్ సిఐ రామకృష్ణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు,యసై లు శ్రీకాంత్, ప్రవీణ్, రంజిత్ రెడ్డి,సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం

- పేదలు ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుంది
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి



నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూనే, సమసమాజ స్థాపనకు ఉద్యమించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో ఏర్పాటుచేసిన పార్టీ 8వ మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఈ మేరకు పేద ప్రజలు ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందని అన్నారు.కార్మిక ప్రజావ్యతిరేక మతోన్మాద నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా, హక్కుల సాధనకై సీపీఐ(ఎం) నిరంతరం పోరాడుతుందని అన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, దేశంలో భూ సమస్యను ఎజెండాగా చేసుకొని తమ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించి, రైతులు శ్రామిక వర్గం పక్షంగా పోరాడుతుందన్నారు. కేంద్రంలోని బిజెపి మతోన్మాదం, నిరుద్యోగం, అవినీతిని పెంచి పోషిస్తూ దేశంలో ప్రజాస్వామ్యం, పౌర హక్కుల పై దాడులు చేస్తుందని అన్నారు. సీపీఐ(ఎం) అధికారంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుంది అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కుల మత ప్రాంతీయ విభేదాలు సృష్టించి, ప్రజల ఐక్యతను దెబ్బ తీస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.లేకుంటే పోరాడక తప్పదని హెచ్చరించారు.అంతకుముందు పార్టీ సీనియర్ నాయకురాలు తాటి విజయమ్మ పార్టీ జెండాను ఆవిష్కరించి అమరులకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కోట గోపి,కందాల శంకర్ రెడ్డి, పులుసు సత్యం, జాజిరెడ్డిగూడెం మండలాధ్యక్షులు శ్రీనివాస్ పార్టీ సీనియర్ నాయకురాలు తాటి విజయమ్మ, పల్లా సుదర్శన్, ఓరుగంటి అంతయ్య, ఎనగందుల విష్ణుమూర్తి, ఎల్లయ్య, యాదగిరి, దేవరాజ్ వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దేశంలో నెం.1గా రాష్ట్ర పోలీసు వ్యవస్థ

- రూ.90 లక్షలతో నిర్మించిన డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

దేశంలోనే తెలంగాణ పోలీసు వ్యవస్థ ప్రథమ స్థానంలో ఉన్నదని రాష్ట్ర భారీనీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో రూ.90 లక్షలతో నిర్మించిన డీఎస్పీ ఆఫీస్, నివాస గృహాన్ని ఐజీలు రమేష్ రెడ్డి, సత్యనారాయణలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పోలీస్‌శాఖ క్రమశిక్షణ కలిగినశాఖ అని వృత్తి నిర్వహణలో ఎంతోమందికి సేవలు చేయడంలో పోలీస్ వారు ముందుంటున్నారని కొనియాడారు. రాష్ట్రంలో పోలీస్ శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాలని ఏర్పాటు చేయడంలో నిధులు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి తో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో నూతనంగా ఏర్పడ్డ పోలీస్ స్టేషన్లు అనంతగిరి, చింతలపాలెం, పాలకీడు, మద్దిరాల, నాగారం పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ భవనాల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌజింగ్ సొసైటి కృషి చేస్తున్నదని స్పష్టం చేశారు. పోలీస్ హౌసింగ్ సొసైటీ ఉత్తమంగా పని చేయడానికి ఆర్థిక సదుపాయాలు కల్పించడానికి నిధులు ఇప్పిస్తామని తెలిపారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించి నూతన కార్యాలయంలో డిఎస్పీ రవి ని చైర్ లో కూర్చోబెట్టి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం నందు తుంగతుర్తి ఎమ్మెల్యే సామెల్ , మల్టీజోన్ 2 ఐజి సత్యనారాయణ ఐపీఎస్ , పోలీస్ హౌసింగ్ ఐజి రమేష్ రెడ్డి ఐపీఎస్ , జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ ఐఏఎస్ , జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ , అదనపు ఎస్పీ లు నాగేశ్వరరావు, జనార్ధన్ రెడ్డి, డీఎస్పీ లు రవి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి ఘన స్వాగతం.. మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు రూ.20 వేల కోట్లు



రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిశ్చయంగా ఉందని, రికార్డు స్థాయిలో ఈసారి ధాన్యం దిగుబడి అయినదని, రైతుల నుండి ప్రతి గింజ సేకరిస్తామని దీనికోసం రూ.20 వేల కోట్లను ప్రభుత్వం సిద్ధం చేసిందని రాష్ట్ర నీటి పారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో డిఎస్‌పి కార్యాలయ ప్రారంభం అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మంత్రి మాట్లడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో 7500 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్ని కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతులకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని 500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 2.20 కోట్ల లబ్ధిదారులకి ఉచిత బియ్యం ఇవ్వడానికి బియ్యం నాణ్యత పెంచామని అందరికీ సంక్రాంతి తర్వాత సన్నబియ్యం ఉచితంగా ఇస్తామని దీనికోసం సన్నబియాన్ని సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలలో ధాన్యం సేకరణకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ స్థాయిలో ధాన్యం సేకరణ ఎప్పుడు జరగలేదని మిల్లర్లకు కూడా ఇబ్బంది లేకుండా ధరలు పెంచుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనలు కలెక్టర్లకు పంపి దాని ప్రకారం కొనుగోలు చేయిస్తున్నామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం తరఫున మాట ఇస్తున్నామని ప్రతి గింజ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ లు నాగేశ్వరరావు, జనార్ధన్ రెడ్డి, డీఎస్పీ లు రవి, శ్రీధర్ రెడ్డి, సూర్యాపేట పబ్లిక్ క్లబ్ ఛైర్మెన్ వేణారెడ్డి, సూర్యాపేట డివిజన్ సిఐ లు,యసై లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-చివ్వెంల

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే కాంటాలు వేసి కొనుగోళ్ల వేగవంతం చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సీపీఐ(ఎం) చివ్వెంల మండల 8వ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ఐకెపి కేంద్రాలను హడావుడిగా ప్రారంభించారు. తప్ప నేటికీ కొనుగోలు ప్రారంభం కాకపోవటం మూలంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలమైనటువంటి నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నారని విమర్శించారు. దేశంలోని మతోన్మాద శక్తులు బిజెపి దాని అనుబంధ సంఘాలు అధికారంలో ఉండటం వల్ల మైనార్టీ మతాలపై రోజురోజుకు తీవ్రమైన దాడులు పెరుగుతున్నాయని అన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన ఆర్థిక విధానాలను అమలు చేస్తూ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టి పట్టినట్లుగా వ్యవహరిస్తుంది ప్రభుత్వం తక్షణమే స్పందించి పట్టణాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు పారేపల్లి వెంకట్రావు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలో మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన ప్రజా పోరాటాల నివేదికను సిపిఎం మండల కార్యదర్శి బచ్చల కూర రామ్ చరణ్ ప్రవేశపెట్టారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి, మండల కమిటీ సభ్యులు కలగాని సోమయ్య,ఇట్టమల్ల స్టాలిన్, బొప్పని సులేమాన్, వల్లపు దాసు జానయ్య,గుండాల దుర్గయ్య, ఇట్టమల్ల ఏసోబు, బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి నర్సిరెడ్డిని గెలిపించాలి



- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య

నవతెలంగాణ-తుంగతుర్తి

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకోవడానికి, విద్యారంగ అభివృద్ధికి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించుకుందామని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య అన్నారు. సోమవారం తుంగతుర్తి మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గురుకులాలు, ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహించి, వాల్ పోస్టర్లు ఆవిష్కరించి, కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ మేరకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి చట్ట సభల్లో ఉపాధ్యాయ ప్రతినిధిగా ఉంటూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కావడంలో ముఖ్యపాత్ర వహించారని, అదేవిధంగా కేజీబీవి పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలలో నెలకొన్న పలు సమస్యల పట్ల స్పందించి ప్రశ్నించే గొంతుకగా ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నన్నెబోయిన సోమయ్య, జిల్లా కోశాధికారి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి మల్లెపాక రవీందర్, తుంగతుర్తి మండల ఉపాధ్యక్షులు ఎడ్ల గోపయ్య సీనియర్ ఉపాధ్యాయులు నాగయ్య రిటైర్డ్ ఉపాధ్యాయులు జోగునూరి దేవరాజ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ జంగయ్య జెడ్పిహెచ్ఎస్ తిరుమలగిరి, టిఎస్ఎంఎస్ అనంతారం పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో కింద జీతాలు రావాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎంఎస్ అనంతారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి సంజీవ కుమార్, జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామర శ్రీనివాస్, జిల్లా టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు ఎస్. సోంబాబు, జిల్లా కోశాధికారి వెంకటయ్య, జిల్లా కార్యదర్శి సున్నపోజు సోమయ్య, తిరుమలగిరి మండల శాఖ ప్రధాన కార్యదర్శి కె.వెంకటయ్య,, సీనియర్ నాయకులు చల్లగుండ సోమయ్య, ఆర్ యాదయ్య, డి శ్రీనివాసచారి,



డి ఎల్లయ్య, దుర్గాప్రసాద్, రాంపల్లి యాదగిరి తిరుమలగిరి మండలం తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాలి



- జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి. రాంబాబు

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తుని పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పి.రాంబాబు అధికారులను ఆదేచించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలాల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని రైతులకి ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యంని తరలించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలపై 16 దరఖాస్తులు, డిడబ్ల్యూఓ 4, డిఆర్‌డిఓ 6, డిపిఓ 1, డిఏఓ 7, ఇతర శాఖలకు సంబంధించి 24, మొత్తం 58 దరఖాస్తులు అందాయని సంబంధిత శాఖలకు తదుపరి చర్యలకై పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ అప్పారావు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నరసింహారావు, సంక్షేమ అధికారులు శంకర్, లత, బిసి వెల్ఫేర్ అధికారి అనసూర్య, డిసిఓ పద్మజ, డిపిఓ నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-తిరుమలగిరి

మండలంలోని తాటిపాముల గ్రామంలో సోమవారం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ సుమారు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను శాసన సభ్యునిగా గెలిచిన అనతి కాలంలోనే తుంగతుర్తి నియోజకవర్గంలో పాటు తిరుమలగిరి మండలాన్ని జిల్లా మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి సహకారంతో అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తాను శాయశక్తుల కృషి చేస్తున్నానని అన్నారు. ఇటీవల కాలంలో గిరిజన తండాలకు రోడ్లు, మంచినీటి సౌకర్యం తో పాటు తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామంలో సిసి రోడ్లను మంజూరు చేసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దరావత్ జిమ్మి లాల్ , మున్సిపల్ అధ్యక్షుడు పేరాల వీరేష్ జిల్లా కాంగ్రెస్ నాయకులు జనార్ధన్ మీడియా ఇన్చార్జి కందుకూరు లక్ష్మయ్య, ఫతేపురం సుధాకర్ చెరుకు సోమయ్య, ఎర్ర యాదగిరి తాటిపాముల గ్రామ నాయకులు నాయిని కృష్ణ తో పాటు నరసింహ పాల్గొన్నారు.

'యాదవుల సంప్రదాయానికి ప్రతీక సదర్ సమ్మేళనం'



నవతెలంగాణ-కోదాడరూరల్

యాదవుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సదర్ సమ్మేళనమని శ్రీశైలం యాదవ్ అన్నారు. కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల యాదవ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సదర్ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, బిజెపి రాష్ట్ర నాయకులు మల్లెబోయిన అంజి యాదవ్ నివాస గృహములో దున్నపోతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణ పురవీధులలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మాట్లాడారు. కోదాడ చరిత్రలో తొలిసారిగా యాదవ సంస్కృతి సాంప్రదాయాలు తెలియజేయటానికి సమ్మేళనాన్ని నిర్వహించిన నిర్వహణ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమ్మేళనాన్ని కొత్తగా నిర్వహిస్తుందని దానికి యాదవులంతా ఎంతో సంతోషం వ్యక్తం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ఎస్ ఎం శ్రీకాంత్ యాదవ్,అధ్యక్షులు బొల్లం సిద్ధు, జక్కుల నరేందర్, బత్తుల కిట్టు,మర్ల వీరబాబు,బొమ్మ సాయి కృష్ణ, వీరబోయిన లింగయ్య,కోడి ఉపేందర్,జడ అంజి యాదవ్, గొట్టి నాగరాజు, పెద్దలు ఈదుల కృష్ణయ్య, కట్టేబోయిన శ్రీను, గుండెల సూర్యనారాయణ,జక్కుల మల్లయ్య, మాదాల ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



నవతెలంగాణ-మునగాల

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) నిరంతరం కృషి చేస్తుందని పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య అన్నారు. సోమవారం మండలంలోని గణపవరం గ్రామంలో పార్టీ గ్రామ శాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా వే ల్పుల అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి కనకయ్య,దాసరి ఎల్లోయ్య, కందుల వెంకటయ్య, పగిళ్ళ చందర్‌రావు, చిన వెంకటయ్య, చందా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకాలు

- మున్సిపల్ చైర్పర్సన్ పెరుమళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్



నవ తెలంగాణ-సూర్యాపేట

ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక తొమ్మిదవ వార్డులో మాజీ మంత్రి, శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి నిధులు రూ.4 లక్షలతో పాటు దాతల సహకారంతో నిర్మించిన లూర్దు మాత మందిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నల్లగొండ పీఠాధిపతులు మహా గణ శ్రీశ్రీశ్రీ కరణం ధమన్ కుమార్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవాళికి చేసిన సందేశాలు ఆచరణీయమని అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో విశ్వాసులకు క్రైస్తవ భక్తులకు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లూర్దు మాత మందిర చర్చి పాస్టర్ పే మరియన్న, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ డాక్టర్ ఎం ప్రభుదాస్ పాల్గొన్నారు.

100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను చేపట్టాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య



నవతెలంగాణ తుంగతుర్తి

100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను వెంటనే చేపట్టి, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. సోమవారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ ఆదేశానుసారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌పై ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ ఆసుపత్రి గేటు ముందు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ నాటి ఎమ్మెల్యే కిషోర్ కుమార్ ప్రతిపాదనలో 100 పడకల ఆసుపత్రిని 45 కోట్ల రూపాయలతో మంజూరు చేసి, అప్పటి మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిలచే శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే హడావుడిగా పనుల ప్రారంభం చేపట్టి మధ్యలోనే పనులు ఆపేశారన్నారు. 8 నెలలు గడుస్తున్నా తిరిగి పనులు చేపట్టలేదని అన్నారు. అదేవిధంగా ఆసుపత్రిలో మందుల కొరత, డాక్టర్ల కొరత నివారించాలని, డిజిటల్ ఎక్సరే, అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాములు గౌడ్, తునికి సాయిలు, గునిగంటి యాదగిరి, తునికి లక్ష్మిగాజుల యాదగిరి, శ్రీనివాస్, నాగమల్లు, రాములు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా గాడి శ్రీనివాస్



నవతెలంగాణ-బీబీనగర్

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకులు గాడి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుల కొండమడుగు నర్సింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన ఎనిమిదో మహాసభలో జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ సమక్షంలో శ్రీనివాసులును ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం రానున్న కాలంలో సీపీఐ(ఎం) సహకారంతో ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు.

జనని స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-ఆలేరుటౌన్

జనని స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆలేరు పట్టణంలో సోమవారం, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీ పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. వివిధ స్కూల్స్ నుండి విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ ఆధారంగా మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి చేతుల మీదుగా ప్రతిభ పురస్కార అవార్డులు అందించారు.మొదటి బహుమతి బుడిది శ్రీవర్షిణి జేఏ జె హైస్కూల్,రెండవ బహుమతిమంగళపల్లి అఖిల, జిల్లా పరిషత్ హైస్కూల్,మూడో బహుమతి మేఘన(8వ తరగతి, ఏకాశీల హైస్కూల్,ప్రత్యేక బహుమతులు బాల, 9 క్లాస్ శ్రీ రామకృష్ణ విద్యాలయ,అక్షర -ఎవరెస్టు హైస్కూల్ గెలుపొందారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి.ఆనంద్, ఎం.భాస్కర్, కె.కమలాకర్, సిద్దులు, సభ్యులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కేదారిగౌడ్ ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రాజపేట



పట్టణానికి చెందిన ఉప్పరి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.మృతురాలి కుటుంబానికి స్వాతి చికెన్ సెంటర్ ప్రొప్రైటర్ నమిలె కేదారిగౌడ్ తన వంతు సహాయంగా సోమవారం 50 కేజీల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో గౌట్ అచ్చాలు,సున్నంబటిబాబు, కానుగంటి మధు, చింటూ, బొర్రారాములు, గౌటే మల్లేశం, ఉప్పరి భరత్, ఉప్పరి శంకరయ్య, ఉప్పరి సత్తయ్య, పంది బాలయ్య,చెరుకు కరుణాకర్, సున్నంబటి నర్సయ్య, గొల్లనప్రశాంత్,భాను గణేష్, గౌటే భరత్, అవినాష్, మహేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



మండలంలోని హనుమాపురం గ్రామంలో పీఎస్ఎస్ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని సోమవారం సింగిల్‌విండో డైరెక్టర్, సీపీఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, సింగిల్ విండో సీఈఓ రాము హాజరై, రైతులతో కలిసి సెంటర్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద లింగారెడ్డి, రంగా కొండ, మెడబోయిన సత్తయ్య, చిన్నలింగారెడ్డి, మోర జంగా రెడ్డి, తుమ్మేటివెంకటేష్‌యాదవ్, హనుమగంటి సత్యనారాయణ, గాదె రమేష్ అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్ పోచయ్య, అనంతరెడ్డి, సత్తిరెడ్డి, బాలకృష్ణ, మైసయ్య, వెంకటేష్, కేతమ్మ,జహంగీర్, సంజీవ, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనం..యాదవులు ఘనంగా జరుపుకునే వేడుక

- మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత

నవతెలంగాణ-బొమ్మలరామారం



సదర్ సమ్మేళనాన్ని యాదవులు ఘనంగా జరుపుకుంటారని మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. బొమ్మలరామారం మండలం ప్యారారం గ్రామంలో యాదవ కులసోదరులు నిర్వహించిన సదర్ సమ్మేళనంలో వేడుకలలో పాల్గొన్నారు.అనంతరం మాట్లాడుతూ యాదవ సోదరులు పార్టీలకు అతీతంగా పండుగ వాతావరణంలో జరుపుకోవా లన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిమ్మల సుధీర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ గుదే బాల నరసింహ, గొడుగు చంద్రమౌళి, పాశ్యానాయక్, దంతపల్లి సత్తిరెడ్డి,రాసాల మల్లేష్‌యాదవ్, చింతల నాగేష్, నీరుగొండ రమేష్‌గౌడ్.పాల్గొన్నారు.

కుర్రారం టీఎఫ్‌టీ నుండి సొసైటీ ఏర్పాటు చేయాలని వినతి

నవతెలంగాణ-రాజపేట

రాజాపేట మండలం కుర్రారం గ్రామ గీత కార్మిక సంఘం టీఎఫ్‌టీ సభ్యుల నుండి సొసైటీ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత ఎక్సైజ్ సూపరింటెండెంట్ శగ్గం సైదులుతో అక్కడే చర్చించి సొసైటీ ఏర్పాటు చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. 30 ఏండ్ల ంండి తాము ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయ సహకారాలు పొందడం లేదని, 30 మంది సభ్యులు ఉన్నట్లు, ప్రస్తుత పరిస్థితుల్లో వారు కల్లు గీసేందుకు చెట్లు ఎక్కలేకపోతున్నట్లు పేర్కొన్నారు. సొసైటీ ఏర్పాటుకు మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో కలెక్టర్‌ను కుర్రారం గ్రామ గీత కార్మిక సంఘం సభ్యులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులుకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు చెప్పారు.



బస్వాపురం రిజర్వాయర్ ముంపు సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-భువనగిరి

బస్వపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎస్.తిమ్మాపూర్ గ్రామ సమస్యల పరిష్కరించాలని భూ నిర్వాసితులు నూతనంగా వచ్చిన ఆర్డీవో కృష్ణారెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో స్పందిస్తూ మీ సమస్యలను అధికారులతో చర్చించి త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చూస్తానన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీటీసీ ఉడుత శారదా ఆంజనేయులు, మాజీ సర్పంచ్ రావులనందు,మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల సుదర్శన్‌రెడ్డి, పాలసంఘం మాజీ చైర్మెన్ జిన్నానర్సింహ, స్కూల్ మాజీ చైర్మెన్ ఉడుత మహేందర్, వళ్ళందస్ గండయ్య, మాజీ వార్డు సభ్యులు వల్లందాసు పరమేష్ ఉన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సారాజిపేటకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినులు దూడల అంజలి, ఐల అర్పిత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.జ్యోతిరాజు, ఫిజికల్ డైరెక్టర్ గడసంతల మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆలేరులో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా 68వ క్రీడలలో ఎస్జీఫ్ కబడ్డీ అండర్ 14 విభాగంలో ప్రతిభను కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో ఈనెల7, 8, 9వ తేదీలలోజరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, రాజేశ్వర్‌రావు, నర్సిరోద్దీన్, కాంతారావు, శ్రీనివాస్, కృపాకర్, రామచంద్రు, సంగీత, దయాకర్ అభినందించారు.



వడ్ల కొనుగోలు కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలంలోని పారుపల్లి, బొందుగుల, సోమవారం, తదితర గ్రామాలలో వడ్ల కొనుగోలుకేంద్రాల్లోని వడ్లను, తేమశాతాన్ని తహసీల్దార్ దామోదర్‌యాదవ్ సోమవారం పరిశీలించారు.వడ్లలో తాలు, తేమశాతం లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు.తేమశాతం ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం 17 శాతంలోపు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహులు, రమేశ్, వ్యవసాయ విస్తరణఅధికారులు అంజయ్య, పీఏసీఎస్ సీఈఓ సిల్వేరు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి మున్సిపాలిటీలో రూ.కోట్ల భూ కుంభకోణం

- ప్రభుత్వ వెబ్‌సైట్‌ను దుర్వినియోగం చేసిన మాజీ యూడీఆర్ఐ
- అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్న కమిషనర్

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్



యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మున్సిపల్‌లో కోట్ల రూపాయల అవినీతి భూ కుంభకోణం వెలుగు చూసింది.తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మున్సిపల్‌పరిధిలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆయా తహసీల్దార్లు ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా నివాస గృహాలనిర్మాణం నిమిత్తం పట్టాలు ఇవ్వడం జరుగుతుంది. ఆ రకంగా పట్టాలు పొందిన వారు ఇండ్లను నిర్మించుకొని మున్సిపాలిటీ వారికి ఇంటి నెంబర్ నిమిత్తం దరఖాస్తు చేసుకుంటే వారికి, ఇంటి పన్ను రశీదులో ఓల్డర్ ఆఫ్ ద ప్రిమిసెస్/ ఆక్యూపయ్యర్ లేదా ప్రజెంట్ ఆక్యూపయ్యర్ అని పేర్కొంటు ఇంటి నెంబర్ కేటాయిస్తారు.ఇంటి టాక్స్ రశీదులో ఇంటి యజమాని పేరు లేకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ పరంగా క్రయ విక్రయాలకు చోటు లేకపోవడంతో కేవలం పట్టాదారుడు మాత్రమే నివాసం ఉండడానికి ఆస్కారం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను రశీదులో వ్యక్తి యొక్క ఇంటి పేరు, వ్యక్తి పేరు సవరణకు ఒక వెబ్సైట్ ద్వారా అవకాశం కల్పించింది.ఈఅవకాశాన్ని మాజీ యూడీఆర్ఐ తనకు అనుకూలంగా మలచుకొని ప్రజెంట్ ఆక్యుపయ్యర్, ఓల్డర్ ఆఫ్ ద ప్రిమిసెస్ ఆక్యూపయ్యర్ ఉన్న స్థానంలో నేరుగా వ్యక్తి యొక్క పేరు చేర్చడం వల్ల పెద్దమొత్తంలో ప్రభుత్వ/ప్రయివేటు ఆస్తులు క్రయ విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ రకమైన ప్రక్రియ ఇందిరమ్మ ఫేస్ -1, ఇందిరమ్మ ఫేస్ -2 , జక్కయ్య నగర్-హనుమాన్‌వాడ తదితర ప్రాంతాల్లో కూడా అవినీతి జరిగినట్లు తెలుస్తోంది.ఈ వ్యవహారం లో పెద్దమొత్తంలో అవినీతి భూకుంభకోణం జరిగినట్టు సమాచారం. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, వెబ్‌సైట్ దుర్వినియోగం కారణమైన అధికారులపై చర్యలు తీసుకోని, కేటాయించిన పేర్లను రద్దు చేయాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

అక్రమాలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేశాం

మున్సిపల్ కమిషనర్ -రామాంజులరెడ్డి



భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మున్సిపల్ ఉద్యోగుల సహకారంతో ప్రజెంట్ ఆక్యుపైయర్ అని కాకుండా తమ పేర్లను నమోదు చేయించుకున్నారని, అది మా దృష్టికి రావడంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి నోటీసులు జారీ చేశాం.ఇప్పటివరకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న నాలుగు సబ్ డాక్యుమెంట్లను రద్దు చేశాం. ప్రధాన డాక్యుమెంట్ రద్దు చేయడానికి ప్రాసెస్ జరుగుతంది.అలాగే మున్సిపల్ మాజీ యూడీఆర్ (అప్పటి డివిజన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్)కు నోటీసులు జారీ చేశాం.అతనిపై డిపార్ట్మెంట్ చర్యలు తీసుకుంటుంది.సంబంధిత స్థలంలో మున్సిపాలిటీ బోర్డు ఏర్పాటు చేశామని, అక్రమ రిజిస్ట్రేషన్‌లపై భువనగిరి సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసులు పంపించాం.సీడీఎంఏకు రిపోర్ట్ చేశాం.

మతోన్మాద బీజేపీతో దేశానికి ప్రమాదం



- దోపిడీ లేని సమాజం నిర్మించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.జహంగీర్

నవతెలంగాణ-చౌటుప్పల్

మతోన్మాద బీజేపీ పాలనతో దేశానికి పెద్ద ప్రమాదం వాటిల్లనుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ సీపీఐ(ఎం) రెండో మహాసభ గోపగోని సుజాతనగర్ కామ్రేడ్ దొడ్ల ఊషయ్య ప్రాంగణంలో పార్టీ నాయకులు ఎమ్‌డి.పాషా, అవ్వారు రామేశ్వరి, గోశిక కర్నాకర్ అధ్యక్షతన నిర్వహించారు. అంతకుముందు పట్టణకేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయం ముందు ఆ పార్టీ మున్సిపల్ కార్యదర్శి బండారు నర్సింహ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుండి బైక్‌ర్యాలీతో మహాసభ ప్రాంగణానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ప్రాంగణంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.పాషా పార్టీ జెండాను విష్కరించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు గోశిక కర్నాకర్ సంతాప తీర్మాణం ప్రకటించారు. ఇటీవల మరణించిన సీపీఐ(ఎం) ఆలిండియా కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం, సీపీఐ(ఎం) తమిళనాడు రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎస్.శంకరయ్య, సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర నాయకులు పెన్న అనంతరామశర్మ, కామ్రేడ్ రొడ్డ అంజయ్య, నల్లబెల్లి బలరాం, ప్రొఫెసర్ జీఎస్.సాయిబాబా, గోపగోని సుజాత, దొడ్ల ఊషయ్య తదితరులకు ఒక్క నిమిషం మౌనం పాటించి, జోహార్లు అర్పించారు. పార్టీ మున్సిపల్ కార్యదర్శి బండారు నర్సింహ కార్యదర్శి నివేదికను చదివి వినిపించారు. అనంతరం జహంగీర్ మాట్లాడుతూ పెట్టుబడిదారి వ్యవస్థ పోయి దోపిడీ లేని సమాజం నిర్మించాలని తెలిపారు. ప్రజలందరూ ఎర్ర జెండా నాయకత్వం కిందకు రావాలని కోరారు. పట్టణ ప్రాంతంలో సీపీఐ(ఎం) బలోపేతం కావాలని తెలిపారు. గ్రామ, మున్సిపల్, మండల కమిటీలు నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. దేశంలో శాస్త్రీయ ఆలోచనలు పెరిగితే తప్ప బీజేపీని అణచి వేయలేమని తెలిపారు. జమిలి ఎన్నికలను సీపీఐ(ఎం) పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం వైపు బీజేపీ అడుగులు వేస్తుందన్నారు.మోడీ పాలనలో మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు.మహిళలకు భద్రత కరువైందన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో స్త్రీలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు విపరీతంగా జరుగుతున్నాయన్నారు. బీజేపీ పాలనలో నిరుద్యోగం పెరిగిపోయిందని విమర్శించారు. ప్రజలకు ఉపాధి లేకపోతే అరాచకం పెరిగిపోతుందన్నారు. పది సంవత్సరాల బీజేపీ పాలనలో డీజిల్, పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ధరలను అదుపు చేయడంలో విఫలం చెందిందన్నారు.విదేశీ పెట్టుబడిదారులకు మూసీ, ఫార్మా భూములను కట్టబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ జపం చేస్తున్నారన్నారు.అనంతరం మున్సిపల్ నూతనకమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దోనూరి నర్సిరెడ్డి, కల్లూరి మల్లేశం, మున్సిపల్ కార్యదర్శివర్గ సభ్యులు గోపగోని లక్ష్మణ్, ఆకుల ధర్మయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గసభ్యులు దాసరి పాండు

నవతెలంగాణ-బొమ్మలరామారం

వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మర్యాల గ్రామంలో సోమవారం ఐకేపీ సెంటర్‌లో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, తడిసిన వరిధాన్యాన్ని కూడా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావొస్తున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు.రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకొస్తే మార్కెట్లోకి తీసుకొస్తే కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని, వర్షాలతో రైతులు ఆరుగాలం పండించిన పంట నీళ్లలో మునిగిపోతున్నదని రైతుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం పనిచేస్తుందని రైతు రుణమాఫీ చేస్తానని చెప్పి రైతుబంధు ఇస్తానని చెప్పి ఇవ్వకపోగా పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయడంలో ఎందుకు ఆలస్యమని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వెంటనే రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లేదంటే ఆ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, రైతుసంఘం నాయకులు దేశెట్టి సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, శైలజ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్

నవతెలంగాణ-వలిగొండ



ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతి, యువకులకు రూ.4016 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిందని, దానిని వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఆ సంఘం మండల మహాసభ మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు యూత్ డిక్లరేషన్ పేరుమీద రాష్ట్రంలో ఉన్న యువతీ యువకులకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారన్నారు.రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేరుకే జాబ్ క్యాలెండర్ ను ప్రకటించిందని, విధివిధానాలను రూపొందించలేదన్నారు.ఉద్యోగ నియామకాలు చేపట్టాలని,రాష్ట్రంలో యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు.రాష్ట్రంలో అనేక మంది డిగ్రీలు,పీజీలు చేసి ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మారి దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారని,యువజనులు అనేక చెడు వ్యసనాలు బానిస అవుతున్నారని, వాటి బారిన పడకుండా ఉండాలన్నారు.గ్రామాల్లో గంజాయి, మాదక ద్రవ్యాలు,డ్రగ్స్ వంటివి విచ్చలవిడిగా దొరుకు తున్నాయని, వాటిని అరికట్టాల న్నారు.ఈనెల 10,11వ తేదీలలో వలిగొండ మండలకేంద్రంలో జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్,జిల్లా ఉపాధ్యక్షులు కవిడే సురేష్,ద్యానబోయిన యాదగిరి, వడ్డెమాన్ మధు, దేశపాకబాబు, ఆకులరాజు, పెద్దబోయినబీమరాజు,మారబోయిన ప్రశాంత్, జరుగుమళ్ల శ్రీకాంత్,అనగంటి గణేష్,నల్లగంటి మల్లేష్,మల్లేష్,శ్రీకాంత్ పాల్గొన్నారు.

అథ్లెటిక్, వాలీబాల్ క్రీడల పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-భువనగిరి

క్రీడలకు మానసికస్థైర్యంతో పాటు శారీరక దారుణ్యం స్నేహభావం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ఏర్పడుతుందని ఇంటర్మీడియట్ నోడల్స్ జిల్లా అధికారి రమణి తెలిపారు. సోమవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా 68వ ఎస్ జి ఎఫ్ ఇంటర్మీడియట్ కళాశాలల అథ్లెటిక్స్ వాలీబాల్ పోటీలు భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల రంగంలో విద్యార్థులు రాణించడానికి ప్రత్యేక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వారి కోసం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. గెలుపోవటంలో సహజమని పేర్కొన్నారు. యువజన క్రీడల జిల్లా అధికారి కే. ధనుంజయ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల ఉన్నత విద్యలో సీటు లభించడానికి అవసరమయ్యే క్రీడ ధ్రువీకరణ పత్రాల వల్ల మేలు జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, కే.ఇందిర, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కోకన్వీనర్ కొలుపుల వివేకానంద, అతికం లక్ష్మీనారాయణ, పీఈటీలు బాలకృష్ణ, పాండురంగం, రమేష్‌రెడ్డి, ఐలయ్య సీనియర్ క్రీడాకారులు అంబోజు అనిల్,హమీద్ పాల్గొన్నారు.





ఆరోగ్యకేంద్రం పరిశీలన

నవతెలంగాణ-భువనగిరి

పట్టణంలోని ఆరోగ్యకేంద్రాన్ని ఉప జిల్లా వైద్య అధికారిని డాక్టర్ శిల్పిని సోమవారం పరిశీలించారు. ఆ కేంద్రంలో ప్రత్యేకంగా నిర్వహించిన దంత వైద్య శిబిరాన్ని పరిశీలించి ప్రత్యేక సూచనలు చేశారు.ప్రజలు ప్రతివారం జరిగే ప్రత్యేక ఆరోగ్య శిబిరాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



ఘనంగా విశిష్ట ఎండి శ్రీనివాసరాజు జన్మదిన వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

విశిష్ట ఎండి సీహెచ్.శ్రీనివాసరాజు జన్మదిన వేడుకలను హబ్సిగూడలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను శ్రీనివాసరాజు ఘనంగా సన్మానించారు. అనంతరం సేవా కార్యక్రమాలు అన్నదానం నిర్వహించారు. వివిధ రియల్ ఎస్టేట్ కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లు పూల బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి సీహెచ్.విజయలక్ష్మి, స్వయంహోమ్స్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జంగయ్యయాదవ్, రియల్ విజన్ డైరెక్టర్స్ సతీష్, గౌరీపతి, కృష్ణ, మార్కెటింగ్ మిత్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనమివ్వాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

నవతెలంగాణ-రామన్నపేట

గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలిచ్చి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరు మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికుల మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నో ఏండ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం నరికాదన్నారు.కారోబార్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాల్లో ఇండ్లు లేని గ్రామపంచాయతీ కార్మికులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని, సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ఈనెల 6న నిర్వహించే కలెక్టరేట్ ముందు మహాధర్నాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బందెల భిక్షం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేష్, సంఘం మండల కార్యదర్శి నకిరేకంటి రాము పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ కార్మిక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

గ్రామపంచాయతీ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరు మల్లేశం సమక్షంలో ఎన్నుకున్నారు. సంఘం నూతన మండల అధ్యక్షులుగా గాదే ఎల్లయ్య, మండల ప్రధానకార్యదర్శిగా నకిరేకంటి రాము, మహిళా కన్వీనర్‌గా కడారి భాగ్య, ఉపాధ్యక్షులుగా బొడ్డు రమేష్, గాదెయాదయ్య, బూడిద మారయ్య, తుర్కపల్లి పరశురాములు, మంచాల రేణుక, సహాయ కార్యదర్శిగా దావనూరి నవీన్, గోగు మహేష్, కోశాధికారిగా కొండగడప నవీన్, తోపాటు 21 మందిని మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

గౌస్‌నగర్‌లో విద్యార్థులకు బెల్టు, టైలు పంపిణీ

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



భువనగిరిమండలంలోని గౌస్‌నగర్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఐడెంటి కార్డు, టై, బెల్టు, బ్యాచ్‌లను అందజేశారు. విద్యార్థులకు సామగ్రి (బెల్టు ,ఐడీ కార్డు, బడ్జ్) అందజేసిన దాత ఎలిమినేటి వెంకటరెడ్డికి పాఠశాల హెచ్‌ఎం కే.సైదా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో చదివి పాఠశాలకు మంచిపేరు తీసుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మెన్ గడసందుల సత్తయ్య, పాఠశాల ఉపాధ్యాయులు గడ్డమీద పాండుగౌడ్,సీహెచ్ సుధాకర్ పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శిక్షణా కార్యక్రమం మండల పరిషత్ కార్యా లయంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి రవీందర్ నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, ఎంఈఓ గురువారావు, ఎంపీఓ అంజిరెడ్డి, ఏఎస్ఓ పవన్, ఎన్యూమారేటర్లుగా టీచర్లు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

నవతెలంగాణ-అడ్డగూడూరు

మండలపరిధిలోని కోటమర్తి, లక్ష్మీదేవి కాల్వ గ్రామాలలో గోపాలమిత్ర సెంటర్‌లోని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో సోమవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పశు వైద్య అధికారి అనిల్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా గర్భం దాల్చని పశువులను గుర్తించి తగిన చికిత్స చేశామన్నారు.కృత్రిమ గర్భధారణ అదేవిధంగా చూడి పరీక్షలు చేశామన్నారు. దూడలకు నట్టల నివారణా మందులు వేశామని తెలిపారు.గాలికుంటు నివారణా టీకాలు వేయడం, రైతులకు కృత్రిమ గర్భధారణ,మేలు జాతి పాడి పశువులపై అవగాహన కల్పించడం, విటమిన్ ఇంజక్షన్లు ఇవ్వడం,పాల దిగుబడిని పెంచే ఖనిజ లవణ మిశ్రమాలను పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌వో శ్రీరాములు, వీఏ ఈశ్వరయ్య, గోపాలమిత్ర సూపర్వైజర్ మర్రి మహేష్, గోపాలమిత్రలు బండి కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-చౌటుప్పల్



చౌటుప్పల్ బైక్ మెకానిక్ యూనియన్ సర్వసభ్య సమావేశం సోమవారం మార్కెట్ యార్డులో నిర్వహించారు.కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వనం శ్రీకాంత్‌కు రూ.26,500, మార్గం రామకృష్ణకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వీరమల్ల అంజయ్యగౌడ్, సుర్కంటి జానారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, స్వామి, ఎమ్‌డి.ఆలామ్, నరేశ్, మహేశ్, శ్రీశైలం, ప్రవీణ్, రాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
మంగళవారం | నవంబర్ 05 , 2024 | www.navatelangana.com

సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా మౌలేశ్వరరెడ్డి

నవతెలంగాణ-చింతలపాలెం



సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా కందుల సుందర మౌలేశ్వర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని విలేకరులతో ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మెల్లచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ(ఎం) 8వ మహాసభ లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, పార్టీకి తన వంతు కృషి చేస్తానని, ఎల్లప్పుడూ ప్రజలకు, పార్టీకి అందుబాటులో అండదండగా ఉంటానని అన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-మాడుగులపల్లి

డిసెంబర్ 2,3,4 తేదీల్లో మిర్యాలగూడలో జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలనిఆపార్టీ మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ కోరారు. సోమవారం స్థానిక అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి , అన్ని రకాల ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు పుల్లెంల శ్రీకర్,జోకూరి నాగయ్య, అయితగాని విష్ణు,ఊరుకొండ శ్రీను,నాయకులు మేడి రవి, మల్లికంటి వీరంకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- ఎంపీ రఘువీర్‌రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

దామరచర్ల మండలంలోని కల్లేపల్లి గ్రామంలో కొలువైన బంగారు మైసమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆలయ నూతన పాలకమండలిసభ్యులచేత ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ప్రమాణ స్వీకారం చేయించి నియామకపత్రాలు అందచేశారు. కల్లేపల్లి బంగారు మైసమ్మ తల్లిని దర్శించుకోవడానికి మండలం నుంచేకాకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు వందలాది సంఖ్యలో వచ్చి తమ మొక్కులను చెల్లించుకుంటారని అన్నారు. ఆలయప్రాంగణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కల్యాణ మండపం, వసతిగృహాల ఏర్పాటుతోపాటు ఇతర సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే



బత్తులలక్ష్మారెడ్డి మాట్లాడుతూ బంగారు మైసమ్మ తల్లి భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమని అన్నారు. ఆలయ అభివృద్ధికి ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామని, ఆలయంవద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరిన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం దేవాలయ నూతన ఛైర్మన్ ధీరావత్ దస్రునాయక్‌తోపాటు 14 మంది సభ్యులైన జాను, అమ్మ, చినసైదులు, లక్ష్మమ్మ, భోజ్యా, మంగ్లా, సుధాకర్, బాలు, బహదూర్, కిషన్,సైదానాయక్‌లతోపాటు ఎక్స్ అఫిషియో మెంబర్‌మాలునాయక్‌లు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీ రఘువీర్‌రెడ్డిని, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలను వారు ఘనంగాసన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, రాష్ట్రనాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మండల అధ్యక్షుడు గాజుల శ్రీను, నాయకులు పొదిల శ్రీనివాస్, రామలింగయ్య మాజీ సర్పంచ్ జనార్ధన్, లింగానాయక్, నెహ్రూ, పాచ్యనాయక్, వెంకటేశ్వర్లు, ఆలయ ఈవో కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీబీకే అక్రమాలను నిరసిస్తూ మహిళాసంఘాల సభ్యుల రాస్తారోకో

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన వీబీకే కాటేపల్లి లింగస్వామి అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ ఆ గ్రామ సమ భావన మహిళా సంఘాల సభ్యులు సోమవారం మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఎస్సై పి.మల్లయ్య కల్పించుకొని సర్ది చెప్పడంతో రాస్తారోకోను విరమించారు. ఇరువైపులా వందలాదివాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. అనంతరం ర్యాలీగా బయలుదేరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా, ఎంపీడీవో భూక్యా యాకుబ్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.మాకు న్యాయం కావాలని, లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడ్డ విబికెను విచారించాలని డిమాండ్ చేస్తు నినాదాలు చేశారు. ఎంపీడీవో భూక్యా యాకూబ్‌నాయక్ మాట్లాడుతూ మీరు నాకు వినతి పత్రం ఇచ్చినందున తప్పకుండా అతనిపై విచారణ నిర్వహించి, అక్రమానికి పాల్పడిన ప్రతి పైసాను రికవరీ చేస్తామని, అవస రమనుకుంటే క్రిమినల్ కేసులు కూడా శాఖ పరంగా పెడతామని తేల్చి చెప్పారు. సత్వరమే విచారణ నిర్వహించాలని మా అందరికీ న్యాయం చేయాలని ఆందోళన కారులు కోరారు. అనంతరం స్థానిక ఎస్బీఐ బ్రాంచి ముందు ధర్నా నిర్వహించి, అన్ని లక్షల రూపాయలు వీబీకే వ్యక్తిగత అకౌంట్‌కు ఎలా ట్రాన్స్‌ఫర్ చేస్తారని వారు బ్యాంక్ అధికారులను, ఉద్యోగులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ వీబీకే లింగస్వామి



సంఘ బంధం ఖాతా నుండి డైరెక్ట్‌గా సంఘాల అధ్యక్షులు సంతకాలను వారికి తెలియకుండానే తీసుకొని లక్షలాది రూపాయలను ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. లోను పూర్తయినా..ఇంకా పూర్తి కాలేదని వసూలు చేసేవాడని, ప్రభుత్వం ఇచ్చే రైతు పోను 28 నెలలు కట్టాల్సిన వాయిదాలను పెంచి 33, 36 వాయిదాలను కట్టించుకున్నాడని ఆరోపించారు. అప్పు ఇప్పించానని వేలాది రూపాయలు ప్రతి సంఘం సభ్యులు నుండి ముక్కు పిండి వసూలు చేసే వారిని, ఏదైనా ప్రశ్నిస్తే వెటకారంగా మాట్లాడుతూ నిందించేవాడని ఆరోపించారు. గ్రామంలో 57 సంఘాలు ఉన్నాయని ఈయన పరిధిలో 28 సంభాన సంఘాలు ఉన్నాయన్నారు. ప్రతి సంఘం రికార్డుల్లోనూ తప్పులేని నమోదు చేశారని, బెదిరించి సంతకాలు పెట్టించుకున్న సంఘటనలు కూడా ఉన్నాయన్నారు.అధికారులు సమగ్ర విచారణ నిర్వహించాలని ముక్తకంఠంతో కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 57 సంఘాల బాధ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'ప్రజా పాలన అందించాలన్నదే రాజన్న లక్ష్యం'

నవతెలంగాణ-మునుగోడు



ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలకు అందించాలన్నదే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్యమని కాంగ్రెస్ మండల నాయకులు మండల బీరప్ప అన్నారు. సోమవారం మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన కాస బుచ్చయ్య అనారోగ్యంతో హాస్పటల్ లో వైద్యం చేయించుకోగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి అండగా ఉండేందుకు ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన 44వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారునికి అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ దండు లింగస్వామి, ఆరకంటి పాపయ్య, మునుగోటి దయాకర్, కూతాటి బిక్షమయ్య , బొడ్డుపల్లి వెంకన్న, మందుల నరసింహ, ఓర్సు వెంకన్న, బొల్లం శీను , మందుల సైదులు, ఎల్లంకి రమేష్ , ఐతరాజు పెద్దలు, చిలక రాజు నరసింహ, బొడ్డుపల్లి నరసింహ, వల్లూరు యాదయ్య, పెరమళ్ళ రమేష్ , ఓర్సు స్వామిగారు, బొల్ల శ్రీనివాస్, అయితగోని నగేష్, పాలంచి సైదులు, సిపిఐ నాయకులు, మందుల పాండు, అన్నం వెంకన్న, ఎట్టయ్య, అయ్యన్న, సత్తయ్య ఉన్నారు.

వడ్డెర వృత్తిదారుల సంక్షేమం కోసం నిధులు కేటాయించాలి

వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం

నవతెలంగాణ-క్లాక్‌టవర్

వడ్డెర వృత్తిదారులకు వృత్తి రక్షణ, సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వృత్తి సంఘాల కార్యాలయంలో వరికుప్పల ముత్యాలు అధ్యక్షతన వడ్డెర వృత్తిదారుల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న క్యారీలు, సీసీ రోడ్లు ,కాలువలు ,కొన్ని సివిల్ కాంట్రాక్టర్లు వడ్డెర్లకు ఇవ్వాలని కోరారు. వడ్డెర్లకు విద్య వైద్యం ఉచితంగా అందించాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ,అరులైన వారికి పింఛన్ ,రేషన్ కార్డులు ఇవ్వాలని, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా 10 లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వరికుప్పల ముత్యాలు, ప్రధాన కార్యదర్శిగా



వరికుప్పల శీను ,ఉపాధ్యక్షులుగా ఇరుగుదెండ్ల శ్రీనివాసు ,గుర్రం రామకృష్ణ ,గంజి రామస్వామి ,మంజుల ,వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా ఇరుగు దిండ్ల ఇద్దయ్య, వరికుప్పల శీను, ఈశ్వర్ ,కమిటీ సభ్యులుగా కొంచెం నాగరాజు, ఒడుగుల అంజయ్య ,గోగుల వెంకన్న ,ఇరుగుదెండ్ల శివశంకర్ ,శివరాత్రి స్వామిలను ఎన్నుకున్నారు.. డిసెంబర్ మొదటి వారంలో జరిగే జిల్లా సదస్సుకు అధిక సంఖ్యలో వడ్డెరలు ఉత్తిదారులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ ఏరియర్స్ వెంటనే ఇవ్వాలి

- రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-క్లాక్‌టవర్

నల్గొండ మున్సిపాలిటీలో పనిచేస్తున్న డ్వాక్రా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన ఏరియర్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నలగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 జూన్ లో 11వ పీఆర్‌సీలో పెరిగిన వేతనాన్ని 2022 జూన్ లో అమలు చేయడం జరిగిందని తెలిపారు. 12 నెలల ఏరియస్ బకాయిలు విడతల వారీగా ఇస్తామని హామీ ఇచ్చిన కమిషనర్ రెండు విడుతల ఇచ్చి ఆపివేయడం జరిగిందన్నారు. వెంటనే పెండింగ్ ఏరియార్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ బట్టలు చెప్పులు ,సబ్బులు ,నూనెలు ,టవల్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఈ నెల 8 వరకు రిలే నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు. రిలే నిరాహార దీక్ష శిబిరానికి సీఐటీయూ జిల్లా కోశాధికారి బాణాల పరిపూర్ణ చారి, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య హాజరై మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి ,కోట్ల అశోక్ రెడ్డి ,యూనియన్ పట్టణ కార్యదర్శి పెరిక కృష్ణ ,వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్ల సంజీవ, పందుల లింగయ్య , ఎల్లమ్మ సుగుణమ్మ, ఇస్రం పాండు, నాగరాజు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.


నరసింహుని గరుడసేవ

నవతెలంగాణ-మఠంపల్లి



మట్టపల్లి మహాక్షేత్రంలో సోమవారం స్వామివారి నిత్య కళ్యాణం అనంతరం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజినేయచార్యులు శాస్త్రోత్తంగా నిర్వహించారు. కళ్యాణంలో గౌరు లక్ష్మి, శివసాయి, తణ్మయిలు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) చిట్యాల పట్టణ కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ-చిట్యాల

సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శిగా బొబ్బిలి సుధాకర్ రెడ్డి ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని స్థానిక మేకల లింగయ్య స్మారక భవనంలో ఆదివారం నాడు జరిగిన పట్టణ మహాసభలో పట్టణ కార్యదర్శిగా సుధాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఐతరాజు యాదయ్య, 11 మంది సభ్యులతో కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా జిట్ట సరోజ, అక్కెనపల్లి నాగయ్య, మాదరగోని వెంకన్న, చిర్రబోయిన గట్టయ్య, మేడి సుగుణమ్మ, జిట్ట స్వామి, పాలమాకుల అర్జున్, వీరమళ్ళ చంద్రమౌళి, బద్దుల రమేష్‌లను ఎన్నుకున్నట్టు తెలిపారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-నకిరేకల్

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడిన సర్పంచులు తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించే చలో హైదరాబాద్ పోరుబాట కార్యక్రమానికి హాజరుకాకుండా నకిరేకల్ మండలంలోని మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు ప్రగడపు నవీన్ రావు, చెట్టుపల్లి జానయ్య, గుడుగుంట్ల లక్ష్మమ్మ శంభయ్య ఉన్నారు.

రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-నకిరేకల్

ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు ప్రస్తుతం అమల్లో ఉన్న రేట్లకు 40శాతం మేర డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్న అధికారుల నేతృత్వ కమిటీ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి యథాతథంగా ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లి అంజన్‌కుమార్ మాట్లాడారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో 7 లక్షల పై చిలుకు విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఏకుల గణేష్, నరేష్, శివ, సాయి, నవీన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-వేములపల్లి

మండలంలోని మూసీవాగు నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రావులపెంట సమీపంలోని మూసి వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో సమాచారం అందుకున్న పోలీసులు శెట్టిపాలెం సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-మర్రిగూడ

మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తహసీల్దార్ బక్క శ్రీనివాసులు సందర్శించారు. ఐకేపీ కేంద్రాలలో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, వసతులు ఎలా ఉన్నాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఐకెపి సిబ్బంది ఉన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం గుట్టలను కూడా ఆక్రమిస్తారా?

- జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు

నవతెలంగాణ-రామన్నపేట

డ్రైఫోర్ట్ పెడతామని రైతులను మోసగించి భూములను కొనుగోలు చేసిన ఆదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆ భూముల ప్రక్కన ఉన్న వందలాది ఎకరాల గుట్టలను కూడా ఆక్రమించడం దుర్మార్గమని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో ఆదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం గుట్టలను ఆక్రమించి రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించిన ప్రాంతాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టలను ఆక్రమించిన సిమెంటు పరిశ్రమ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామన్నపేట నుండి కొమ్మాయిగూడెం వరకు వందలాది ఎకరాలలో విస్తరించి ఉన్న సబ్బుంబోళ్ల గుట్టలను అక్రమంగా ఆక్రమించి రెండు కిలోమీటర్ల వరకు



సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం రోడ్డు నిర్మాణం చేసిందని విమర్శించారు. చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 30 ఏండ్ల కిందట ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 559 ప్రకారం జీవాల మేత కోసం ఈ గుట్టలను కొమ్మాయిగూడెం, రామన్నపేట గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు కేటాయించిందని గుర్తు చేశారు. సిమెంటు పరిశ్రమ ఏర్పాటు కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన మండల, డివిజన్, జిల్లా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ యంత్రాంగం గుట్టను అనుకొని నిర్మించిన రోడ్డును చూసి చూడనట్లు వ్యవహరించారని విమర్శించారు. రామన్నపేట మండల పరిధిలోని భూమి, నీరు, గాలి, విద్యుత్తు మొదలైన సహజ వనరులు అన్నిటిని లూటీ చేసి నిర్మించే ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల జల, వాయు వాతావరణ కాలుష్యంతో పాటు గడ్డిపై దుమ్ము ధూళి పేర్కొని పోవడంతో ఆ గడ్డిని తినటం వల్ల గొర్రెలు, మేకలు, పాడిపశువులు శ్వాస, జీర్ణకోశ వ్యాధులకు గురై రైతులు, గొరకాపర్లు, వృత్తిదారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ గాలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరి నాగేష్, మండల పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో కన్వీనర్ రెహాన్, తిరుగుడు మల్లికార్జున్, జీఎంపీఎస్ నాయకులు నీల అయిలయ్య, గొర్రెల పెంపకందారుల సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కనగంటి ఐలయ్య, తీర్పాల మల్లయ్య తీర్పాల ఐలయ్య, మోటె శీను, ఇస్తారి, బంటు సత్తయ్య, రేపాక లింగస్వామి, బాతుక వెంకన్న, బాతుక మహేష్, బెల్లి లింగస్వామి, నర్సింహ, బుర్ర శ్రీశైలం పాల్గొన్నారు.

లండన్ పర్యటనకు పటేల్ రమేష్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

తెలంగాణ ప్రభుత్వ అధికారిక పర్యటనలో భాగంగా ఈనెల 5, 6, 7 తేదీల్లో లండన్‌లో జరిగే వరల్డ్ ట్రావెల్ మార్కెట్లో ప్రభుత్వం తరపున పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొనేందుకు బయలుదేరారు. సోమవారం హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సెండాఫ్ పలికారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేయడం, పర్యాటక రంగంలో పెట్టుబడులే లక్ష్యంగా వారి లండన్ పర్యటన సాగనుందని పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటకులకు తెలంగాణ చరిత్ర, వారసత్వ సంపద తెలిసేలా పర్యాటక శాఖ అక్కడ ఓ స్టాల్‌ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఈ ట్రావెల్ మార్ట్‌లో 100కు పైగా విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఇంకా ఈ పర్యటనలో ప్రభుత్వం నుంచి ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి నడిమట్ల శ్రీధర్ హాజరుకానున్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత ఆవేదన

నవతెలంగాణ-భువనగిరి

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని ఎం వి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఎం వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన భువనగిరిలో ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాహక్కు చట్టాన్ని బాలల విద్యను దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రధానోపాధ్యాయులకు పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకే నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారన్నారు. విద్యాహక్కు చట్ట ప్రకారం సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలో 210 దినాలు మరియు 800 బోధన గంటలు నిర్ణయించనైనదన్నారు.ప్రభుత్వ పాఠశాలల సమయం మార్పుతో పాఠశాలలపై దిగజారుతున్న విశ్వాసానికి ఆదేశాలు తల్లిదండ్రుల మనోవేదనకు అజ్యం పోశాయన్నారు.ఉపాధ్యాయులకు జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరిత్యాలలో సహాయ విధులు మరియు పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన విధులను మినహాయించి టిచర్లను ఏ ఇతర విద్యేతర పనులకు పంపకూడదని విద్యాహక్కు చట్టం నిర్దేశిస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కోసం ఉపాధ్యాయులను వినియోగించుటకు జారీచేసిన ఉత్తర్వులు విద్యా హక్కు చట్ట ఉల్లంఘన కిందికి రావడమే కాకుండా బాలల విద్యా హక్కును ఉల్లంగించినట్లు అయితుందన్నారు. విద్యాహక్కు చట్టాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని విజ్ఞప్తి చేశారు.

పత్తి కొనుగోలులో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

మార్కెట్ కమిటీ చైర్మెన్ చైతన్యరెడ్డి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

పత్తి కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చూడాలని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఐనాల చైతన్య రెడ్డి తెలిపారు. ఆలేరు మండల కేంద్రంలో సోమవారం శ్రీమల్లికార్జున కాటన్‌మిల్‌లో, మం డలంలోని శారాజిపేట గ్రామంలో శ్రీనిధి కాటన్ ఇండస్ట్రీస్‌లో పత్తి కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి, ప్రభుత్వ మద్దతుధర పొందాలని కోరారు.ఈ కా



ర్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ పచ్చిమట్ల మదార్, పీఏసీఎస్ చైర్మెన్ మొగిలిగాని మల్లేశం, డైరెక్టర్లు ఇల్లెందుల మల్లేశం, ఎగిడి యాదగిరి, కిష్టయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బిస కృష్ణంరాజు, మార్కెట్ సెక్రెటరీ పద్మాజా, సహాయ అధికారి దివ్య పాల్గొన్నారు.

ఎస్ఆర్‌టీఆర్ఐ దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భూధాన్‌పోచంపల్లి

మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామ స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ యువతీ ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతితో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ రెండు నెలల కాల పరిమితితో శిక్షణను పదవ తరగతి పూర్తి చేసి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 11న ఒరిజినల్ సర్టిఫికెట్స్ జిరాక్స్‌సెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో సంస్థలో హాజరుకావాలని తెలిపారు.

17 నుంచి పాదయాత్ర

నవతెలంగాణ-తిరుమలగిరి

తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమం కోసం ఈనెల 17న సూర్యాపేట అంబేద్కర్ విగ్రహం నుంచి భద్రాచలం వరకు మొదటి విడత పాదయాత్ర జరగనుంది. ఈ మేరకు తిరుమలగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ఉద్యమకారుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పలువురు మాట్లాడుతూ పాదయాత్రకు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను మరియు ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలన్నారు. పక్క రాష్ట్రమైన జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో ఉద్యమకారులకు ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయో అదేవిధంగా తెలంగాణలో అవే సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మ బలిదానాలు చేసుకున్న కుటుంబాలకు 25 లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. తెలంగాణ కోసం ఉద్యమం చేసిన వారిని గత ప్రభుత్వం ఉద్యమకారులని గుర్తించలేదని, ఇప్పుడున్న ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించాలని కోరుకుంటున్నామన్నారు.



'ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి'

నవతెలంగాణ-చిలుకూరు

ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన 6 గ్యారంటీల పథకాలను అమలు చేయాలని మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు రేమిడియాల జయసుధ అన్నారు. సోమవారం మండలంలోని జెర్రిపోతుల గూడెం గ్రామంలో మహిళా సమైక్య సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పునర్ ఆలోచన చేసి ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య ప్రధాన కార్యదర్శి అలివేలు మరియమ్మ అరుణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీకి విద్యార్థినుల ఎంపిక పట్ల హర్షం

నవతెలంగాణ-కోదాడరూరల్

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినిలు ఎంపిక కావడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుడిబండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రూపను అభినందించి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో కబడ్డీ టీంకు అండర్ 14 విభాగంలో ఎంపికైన



సందర్భంగా గుడిబండ గ్రామ పెద్దలు తూమాటి వరప్రసాద్‌రెడ్డి గెజిటెడ్ హెడ్మాస్టర్ కె విమల కుమారి, ఉపాధ్యాయ బృందం రూపశ్రీని, పిడి పార్వతీని అభినందించారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి సోమిరెడ్డి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

ఆపదలో ఉన్న పేదలకు ఆపన్న హస్తం అందిస్తూ పేదలకు పెన్నిధిగా ఉంటూ వైద్య సేవలు అందించిన ఘనత డాక్టర్ సోమిరెడ్డికి దక్కిందని, హుజూర్ నగర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి డాక్టర్ సోమిరెడ్డి అని ఆయన శిష్య బృందం కొనియాడారు. డాక్టర్ సోమిరెడ్డి ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా ఆయన ఆర్చివద్ద నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి సూర్యనారాయణ ఎం వెంకటేశ్వర్లు పూల మాలవేసి నివాళులర్పించి



మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి కళాకారులు డాక్టర్ సోమిరెడ్డి వైద్య సేవలపై పాడిన పాటలు ఎంతో ఆకర్షించాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, సన్నిధి వెంకటేశ్వర్లు, బంగారు సుధాకరాచారి, సంజీవరావు, రమేష్, ఉపేందర్ , శ్రీను పట్టణ ప్రముఖులు వెల్లావుగా రాములు, చిట్యాల అమర్నాథరెడ్డి, గుండా రమేష్, గుండు వెంకటేశ్వర్లు, ముషం సత్యనారాయణ, కంబాల శ్రీను, సప్పిడి బిక్షం, రాము, ములకలపల్లి సీతయ్య, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పురాతన ఆలయ నిర్మాణానికి సహకరించాలి

నవతెలంగాణ-చిలుకూరు

పురాతన కాలంనాటి ఆలయం శిథిలావస్థకు చేరడంతో తిరిగి పునర్నిర్మించడానికి దాతల రూపంలో రావాలని శివాలయ కమిటీ చైర్మెన్ దొంగరి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని బేతవోలు గ్రామంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని తిరిగి పున:ప్రారంభించాలని కరపత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో 150 సంవత్సరాల క్రితం నిర్మించిన రామలింగేశ్వర శివాలయం శిథిలావస్థకు చేరడంతో నూతనంగా నిర్మించడానికి గ్రామంలోని ప్రజలు దాతల రూపంలో ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పండ్ల శ్రీను సాయిలి నవీను పత్తిపాక శ్రీశైలం దొంగరి నాగేశ్వరరావు బెజవాడ వినోదు తాళ్లూరి రామారావు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో సోమవారం మండల పశు వైద్యాధికారి వెంకన్న ఆధ్వర్యంలో వేయడం జరిగింది. ప్రతీ పశువుకు చెవికి టాగ్ వేసి, ఆ సమాచారాన్ని ఆన్లైన్ లో నమోదు చేయడం ద్వారా రైతులకు రానున్న రోజుల్లో మరిన్ని సేవలందనున్నాయని, ప్రతీ రైతు తమ పశువులకు చెవికి టాగ్ వేయించుకోవాలని సూచించారు.

కోళ్ల ఫారం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-మునుగోడు

మండలంలోని కోతులారం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా జన వాసాలకు దగ్గరగా నిర్మాణం చేపడుతున్న కోళ్ల ఫారం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు ఎంపీడీవో విజయ్ భాస్కర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్ల పక్కనే కోళ్ల ఫారం ను నిర్మాణం చేస్తే కోళ్ల ఫారం నుండి వచ్చే ఈగలతో ప్రజలు అనారోగ్య బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ జక్కల లోకేష్ , బంగారు రవి , అంజయ్య , బాలరాజు , యాదయ్య , వెంకటేశ్, ఉపేందర్ , నరసింహ్మ , జంగయ్య తదితరులు ఉన్నారు.

ఎస్వీఆర్ ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో సోమవారం ఆర్ఐలు రంజిత్ రెడ్డి, అజీజ్ ఉన్నిసా ఎస్వీఆర్ ఫౌండేషన్ సంస్థ కార్యాలయంను సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన నాటి టీడీపీ నేత ఎడవల్లి సంజీవరెడ్డి 15 సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. సంజీవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అఖిల్ రెడ్డి ఎస్వీఆర్ ఫౌండేషన్ను సంస్థను స్థాపించాడు. గ్రామంలో తన సంస్థ కార్యాలయంను ప్రారంభించి.. యువతి, యువకులకు క్రీడల్లో ఆసక్తి పెంచే విధంగా క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తమ సంస్థ ద్వారా గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వికలాంగుడు షేక్ రంజాన్‌కు 25 కేజీల బియ్యంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి సౌజన్య, యాదగిరి, సతీష్, సురేష్, శ్రవణ్ రెడ్డి, నాగయ్య, సుందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-కోదాడరూరల్

హుజూర్నగర్ కోదాడ రెండు నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి అని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మేళ్లచెరువు కాశీనాథ ఫంక్షన్ హాల్ వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇరిగేషన్ శాఖలో అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని అన్నారు. కోదాడ, హుజూర్ నగర్‌లో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వివిధ శాఖల సంబంధించి ఒక్క సంవత్సరం లోనే మంచి అభివృద్ధి సాధించామన్నారు. కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలు తమకు రెండు కండ్ల లాంటివన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఈ వానాకాలం అత్యధికంగా పంట తెలంగాణలో పండిందన్నారు. 50 మెట్రిక్ టన్నుల ప్యాడి పంట పండింది.సోషల్ లీక్ ఎకనామిక్ సర్వే తో కుల ఘనన చేయడం జరుగుతుంది ఉన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ,ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఎడ్యుకేషన్ డి ఎం ఎఫ్ టి వైద్య ఆరోగ్యం ఈ శాఖల గురించి ముందుగా సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి,జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ ఎమ్మెల్యే వెనకాల చంద్రావు, పలువురు నియోజకవర్గ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాదరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతురావు

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్



ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 48 అర్జీలను స్వీకరించారు. అందులో రెవెన్యూ శాఖ 24, మున్సిపాలిటీ 5, జిల్లా పంచాయతీ అధికారి 5, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 3, సర్వే ల్యాండ్ రికార్డ్ 2, ఎక్సైజ్ శాఖ, సంక్షేమ శాఖ, వ్యవసాయ శాఖ, మైనింగ్ శాఖ, వైద్య శాఖ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్ శాఖ, ఆర్టీసీ కు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శోభారాణి, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

నవతెలంగాణ-కొండమల్లెపల్లి



అనుమానాస్పద స్థితిలో రైతు పొలం వద్ద మృతి చెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై రామ్మూర్తి , కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ...గ్రామానికి చెందిన పంగ శ్రీనివాస్(36) రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం 6 గంటలకు ఇంటి వద్ద నుంచి పొలం వద్దకు వెళ్లాడు. శ్రీనివాస్ తల్లి సైదమ్మ కూలీలను తీసుకొని ఉదయం 9:30గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లింది. శ్రీనివాస్ అనుమానాస్పద స్థితిలో అపమారక స్థితిలో పొలం వద్ద కింద పడిపోయి ఉండడంతో గమనించిన తల్లి సైదమ్మ కూలీల సహాయంతో రోడ్డుపైకి చేర్చి ఆటోలో గ్రామానికి తీసుకొచ్చింది. 108 అంబులెన్స్ ద్వారా శ్రీనివాస్‌ను దేవరకొండ ప్రభుత్వాసుపత్రి తీసుకువెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు శ్రీనివాస్ అప్పటికే మృతి చెందాడని తెలిపారు. శ్రీనివాస్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గ్రామానికి తరలించారు. ఆరేండ్ల క్రితం శ్రీనివాస్ భార్య భవిత ఇంట్లో విద్యుద్ఘాతంతో మృతిచెందింది. శ్రీనివాస్ ఆరేండ్ల క్రితం మరో మహిళను వివాహం చేసుకున్నాడు. శ్రీనివాస్ చెందాడు 12 ఏండ్ల పాప, బాబు ఉన్నారు. చిన్న వయసులోనే పిల్లల్ని కన్న తల్లిదండ్రులు ఇద్దరు చనిపోవడంతో అనాథలుగా మిగిలిపోవడంతో గ్రామంలో గ్రామస్తుల, బంధుమిత్రుల రోధనతో గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ సంఘటనపై మృతుని తల్లి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మూర్తి తెలిపారు.

రైతు శ్రీనివాస్ మృతి బాధాకరం : ఎమ్మెల్యే



గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన రైతు పంగ శ్రీనివాస్ మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం గుమ్మడవల్లి గ్రామానికి చెందిన రైతు పంగ శ్రీనివాస్ (36) పొలం వద్ద అనుమానస్పద స్థితిలో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుని నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట దేవరకొండ మున్సిపల్ చైర్మెన్ ఆలంపల్లి నరసింహ కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ మేకల శ్రీనివాస్ యాదవ్, వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఊటుకూరి వేమన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బొడ్డుపల్లి సైదులు, మాజీ సర్పంచులు పంగ మల్లయ్య, బోడ యాదయ్య, గుండెబోయిన లింగం యాదవ్, ఆదిరాల రాము, బచ్చనబోయిన శ్రీనివాసులు ,యాదయ్య ఉన్నారు.

యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



- డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా కార్యదర్శి మల్లం మహేష్

నవతెలంగాణ-మిర్యాలగూడ

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ డిమాండ్ చేశారు.డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణ అధ్యక్షులు మహ్మద్ వదూద్ జెండా ఆవిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా యువత సమస్యలపై డీవైఎఫ్ఐ నిరంతరం ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం ఎన్నికల కోసం వాడుకుం టుందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఉన్న ఉద్యోగాలను కోల్పోయేలా చేస్తుందన్నారు. నూతన ఉద్యోగాలను కల్పించడంలో విఫలమైందన్నారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగ శాతం విపరీతంగా పెరిగిపోయింది అన్నారు.కేంద్ర బీజేపీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలను ప్రోత్సహించడం సరికాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను,యువత సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.అర్హత ఉన్న ప్రతి నిరుద్యోగ యువతకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.యువత సమస్యలను పరిష్కరించకుంటే డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పతాని శ్రీను,జిల్లా కమిటీ సభ్యులు నాగేంద్ర ప్రసాద్, టౌన్ కార్యదర్శి పల్ల భిక్షం పట్టణ నాయకులు నాయకులు ఫెరోజ్,మోహన్, సలీం,వాజిద్,సాయి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వినతి

నవతెలంగాణ-మిర్యాలగూడ

సంక్షేమ హాస్టల్లో పెరిగిన మెస్ చార్జీలకనుగుణంగా మెనూ పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు జగన్ సైదా నాయక్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు మెస్ ఛార్జీలను పెంచడం జరిగిందన్నారు. గత మెస్ చార్జీలు తక్కువగా ఉండటం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేదన్నారు. ప్రభుత్వం 1వ తరగతి నుండి 7వ తరగతి విద్యార్థులకు 1330 , 8వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు 1540, ఇంటర్ పీజీ విద్యార్థులకు 2100 తో మెనూ పెంచిందన్నారు. పెంచిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు అదేవిధంగా హాస్టల్లో ట్యూటర్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం టౌన్ కార్యదర్శి నుమాన్ మిర్యాలగూడ మండల అధ్యక్షుడు మనీ నాయక్ అనిల్ సాయి సూర్య రవి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి



వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామంలో ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లలో ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు.కాంగ్రెస్ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు.



డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-గరిడేపల్లి

జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ హుజూర్నగర్ సీఐ చరమందరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ చలికంటి నరేష్ మండల కేంద్రంలోని కొత్తగూడెం గ్రామంలో సైబర్ నేరాలపైన గంజాయి డ్రగ్స్ మత్తుమందులపై రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాబృందంతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ చలికంటి నరేష్ మాట్లాడుతు ప్రజలు సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దని వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు ఏటీఎం పిన్ నెంబర్లు సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని అన్నారు. అనంతరం పోలీసు కళబృందం సాంస్కృతిక పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వేంకటేశ్వర్లు, కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య గోపయ్య గురలింగం క్రిష్ణ నాగార్జున పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్



రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 7500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బకాయిలను విడుదల చేయాలని కోరుతూ కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. మూడేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, బహుజన విద్యార్థుల అభివృద్ధి కోసం తోడ్పడాలని అన్నారు. ఇప్పటికైనా వెంటనే స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అల్లంపల్లి కొండన్న, ఉపాధ్యక్షులు కాసర్ల లింగస్వామి, రాష్ట్ర కోఆర్డినేటర్ బాకీ తరుణ్, నియోజకవర్గ అధ్యక్షులు పగడాల శివతేజ, సింగపంగా వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

11కేవీ విద్యుత్ లైను మార్చాలని వినతి

నవతెలంగాణ - చండూరు

మండలంలోని బంగారు గడ్డ గ్రామంలో ని నాంపల్లి రోడ్ లో ఇండ్లపై ఉన్న11కేవీ విద్యుత్ లైను వెంటనే మార్చాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఇన్‌చార్జి విద్యుత్ ఏఈ ప్రవీణ్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 30ఏండ్లుగా విద్యుత్ తీగలు ఇండ్లపైన ఉందని, గాలి దుమారం వచ్చినప్పుడు ఎప్పుడు ఏ తీగ తెగుతుందో అని భయంగా ఉందని పేర్కొన్నారు.గతంలో అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేదన్నారు. స్థానిక మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించి లైన్ మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగిల వెంకటయ్య, మాదగోని యాదయ్య, నకిరేకంటి యాదయ్య నాగిళ్ళ , అంజయ్యసుంకరి నరేష్, నలపరాజు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు

నవతెలంగాణ-తిరుమలగిరి

పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హైదరాబాదుకు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ సర్పంచులతో పాటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సంకేపల్లి రఘునందన్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దరావత్ దేవా,రవీందర్ నాయక్, బెడిద కరుణాకర్, జాటోత్ రవి, శ్రీను నాయక్ ఆకుల వీరయ్య తో పాటు బిఆర్ఎస్ నాయకులు కందుకూరి బాబు నరేష్ యాకూబ్ నాయక్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు: ముందస్తు అరెస్టు చేయడం సరికాదని మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు నారాయణపురం మాజీ సర్పంచ్ తమనబోయిన శంకర్ అన్నారు. మాజీ సర్పంచులను ముందస్తులు అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు బానోతు నందలాల్ పులగం రవీందర్ వేనేపల్లి ఉపేందర్ మామిడి చిన్న రాములు పాల్గొన్నారు.

పెన్ పహాడ్: మండలంలోని మాజీ సర్పంచులను సోమవారం ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆంగోత్ యాదగిరి నాయక్ అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచులు బిట్టు నాగేశ్వరరావు, నెమ్మాది నగేష్, అంగోత్ సైదానాయక్, మాజీ సర్పంచుల భర్తలు బండి రామకృష్ణారెడ్డి, కొండేటి సుధాకర్, భూక్య రవీందర్, బోలక బొబ్బయ్య ఉన్నారు.

రైతుకు భరోసా ఏది?



- విధి విధానాలంటూ కాలయాపన
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నా రైతులు
- రానే వచ్చిన రబీ సీజన్

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

అర్హులైన ప్రతి ఒక్కరికి పెట్టుబడి సాయం అందించడమే రాష్ట్ర సర్కారు లక్ష్యం..రైతు భరోసాపై గతంలో కంటే భిన్నంగా విధివిధానాలు సిద్ధం చేస్తున్నాం..రాష్ట్ర మంత్రివర్గ సబ్ కమిటీ రిపోర్టు ఆధారంగానే రైతు భరోసా అందజేస్తాం..సబ్ కమిటీ విధివిధానాలు రూపొందిస్తుంది.ఇక రైతుల ఖాతాలో డబ్బులు పడడమే ఆలస్యం అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చేస్తున్న ప్రకటనలు అమలుకు నోచుకోకపోవడంతో రైతు భరోసాపై సాగు రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి.పెట్టుబడి సాయం అందక,బ్యాంకర్లు కొత్త రుణాలు ఇవ్వక పోవడంతో బ్యాంకుల చుట్టూ తిరిగి విసుగెత్తిన రైతులకు ప్రయివేటు వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు.అధికవడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేస్తున్న రైతులు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆర్థిక నష్టాలకు గురవుతున్నారు.2024 జులై 3న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పై విధివిధానాలు రూపొందించేందుకు మంత్రి వర్గం సబ్ కమిటీని నియమించింది.జూలై 10 నుంచి 23 వరకు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారిగా రైతు సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు తీసుకోవాలని జూలై 9న రాష్ట్ర ముఖ్యమంత్రి సబ్ కమిటీకి సూచనలు చేశారు.5నుంచి10ఎకరాలలోపు ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేయాలని అత్యధిక శాతం మంది రైతులు సూచించినట్లు ప్రచారం జరిగింది.గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు కింద కొండలు,గుట్టలు,రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగులో లేని భూములకు సైతం దాదాపు రూ .25 వేల కోట్లు వెచ్చించారు.మా ప్రభుత్వ హయాంలో కేవలం సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా జమ చేస్తాం.విధివిధానాలు ఫైనల్ కాగానే యాసంగి నుంచి ఎకరాకు రూ.7,500ల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విధి విధానాల పేర కాలయాపన చేస్తుందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ రైతు భరోసా కింద రైతు లకు ఖరీఫ్,రబీ సీజన్‌లో ఎకరాకు రూ.7500 ల చొప్పున సంవత్సరానికి రూ.15వేలు ఇస్తామన్నారు.అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ మాదిరిగానే ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు రూ.5 వేల చొప్పున కొంత మంది రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 9,08,810 రైతులు ఉండగా సగం మంది రైతులకు పెట్టుబడి సాయం అందలేదని వాపోతున్నారు.నారాయణపురం మండలంలో 3370 మంది రైతులు ఉండగా ఖరీఫ్ సీజన్‌లో 1719 మంది రైతులకు రూ. 19,14,85,945 పెట్టుబడి సాయం కింద అందజేశారు.గత ప్రభుత్వం లెక్కల ప్రకారం చూస్తే ఇంకా 1651 మంది రైతులకు రూ.14,54,48,727లు అందజేయాల్సి ఉంది.రైతు భరోసా పై రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం తీసుకున్న నిర్ణయాల ప్రకారమైనా రబీ సీజన్లో అర్హులైన రైతులకు పెట్టుబడి సాయం అందించాలనీ పలువురు రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ వచ్చినాక రైతుబంధు చూడలే
వాంకుటోతు రాములు-వాచ్యతండా రైతు



కేసీఆర్ ఉన్నప్పుడే రైతుబంధు పైసలు చూసిన.కాంగ్రెస్ వచ్చినంక చూడలే.నాకున్న రెండెకరాల భూమితో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేసిన రైతుబంధు డబ్బులు రాకపోవడంతో రూ.50 వేలు అప్పు తెచ్చిన. కాంగ్రెస్ ప్రకటించిన రుణమాఫీ పూర్తిగా వర్తించలేదు.రూ.70 వేల అప్పు తీసుకుంటే వడ్డీతో కలిపి రూ.94 వేలైంది. రూ.6600 తిరిగి కట్టించుకున్నారు.తిరిగి పంట రుణం తీసుకునేందుకు 3నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్న రేపు మాకు అంటూ తిప్పుతున్నారు.

రైతుబంధు రాలే
శ్రీరాముల యాదయ్య-వాయిల్లపల్లి రైతు



మూడెకరాల భూమి ఉన్నా రైతుబందే రాలేదు.మోడీ పైసలు రూ.2వేలు తప్ప రైతుబంధు పైసలు రాలేదు.బయట అప్పులకు తెచ్చి పత్తి పంట వేసిన.మాజీ సీఎం కేసీఆర్ సమయానికి ఇచ్చేటోడు.పంట రుణాల కోసం నెల రోజుల నుంచి బ్యాంకు చుట్టూ తిరుగుతున్న ఇవ్వడం లేదు.పని చెడి పోతుంది తప్ప పైసలు అందడం లేదు.ప్రభుత్వమే బ్యాంకులపై చర్య తీసుకోవాలి.ఇబ్బందులు లేకుండా పంట రుణాలు ఇవ్వాలి.

సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ -పెద్దవూర

పెండింగ్ బిల్లుల్లు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు సోమవారం తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుండగా మండలకేంద్రంలో సాగర్ సీఐ బీసన్న ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. సర్పంచుల హక్కులను కాలరాసిన పోలీసు వైఖరిని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచులు సంజీవరెడ్డి రావుల శీను, తుమ్మపు శీను, రమావత్ చీనా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, నరేష్ నాయక్, మల్లారెడ్డి, రామంజి , శంకర్ నాయక్,రమణారెడ్డి ఉన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-డిండి

చెకుముకి సైన్స్ సంబరాలుపోస్టర్ ను స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన సమయం లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో నవంబర్ 7, మండల స్థాయిలో ఈనెల 21, జిల్లా స్థాయిలో ఈనెల 28, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 14,15,16 తేదీ లలో ఆదిలాబాద్ లో జరుగుతున్నాయని వారన్నారు. ఇందులో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక నాయకులు బి యాదయ్య, టిఎస్ యుటిఎఫ్ సీనియర్ నాయకులు లింగగిరి సత్యనారాయణ, గందమల్ల రామారావు, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తులకు రెండు రోజుల గడువు

నవతెలంగాణ- త్రిపురారం

మార్చి నెలలో జరగనున్న నల్గొండ,వరంగల్,ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు కోసం ఇంకా రెండు రోజులే గడువు ఉందని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ తెలిపారు.సోమవారం త్రిపురారం తహసీల్దార్ కార్యాలయంలో ఓటు నమోదు చేసుకున్న దరఖాస్తులను తహశీల్దార్ గాజుల ప్రమీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, కేజీబీవీ,మోడల్ స్కూల్, గురుకులాలు, పీజీ,పాలిటెక్నిక్,యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకులు టీచర్స్ ఎమ్మెల్సీ ఓటు కోసం ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. రెండు రోజుల గడువు మాత్రమే ఉన్నందున ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్యను అందించాలి: డీఈఓ

నవతెలంగాణ -పెద్దవూర

విద్యార్థుల విద్య పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి, నాణ్యమైన విద్యా బోధన చేయాలని జిల్లా విద్యాధికారి బిక్షపతి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని జెడ్పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, పరిసరాలు,విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తయారీ విధానం, స్టోర్ రూమ్ లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలోని టాయిలెట్లను, పరిసరాలను స్వయంగా పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల వివరాలు అడిగి తెలుసుకుని హాజరు పట్టిక, సాధారణ సెలవు రిజిస్టర్ లను పరిశీలించారు. ముందస్తు సమాచారం లేకుండా, సెలవు దరఖాస్తు ఇవ్వకుండా గైర్హాజరైన ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ తరి రాము, ఉపాధ్యాయులు, సీ ఆర్పీ పాల్గొన్నారు.

దళితులకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-కోదాడటౌన్

దళితులకు బేషరతుగా జిల్లా గ్రంధాలయ చైర్మెన్ వంగవీటి రామారావు క్షమాపణ చెప్పాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో జిల్లా గ్రంధాలయ చైర్మెన్ వంగవీటి రామారావు దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. దళిత కులాల్లోని ఒక వర్గాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వంగవీటి రామారావు పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. జిల్లా గ్రంధాలయ చైర్మెన్ పదవికి తక్షమే రాజీనామా చేయాలన్నారు. రంగా థియేటర్ చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

దొడ్డు ధాన్యానికి బోనస్ ఇవ్వండి : మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-నకిరేకల్

సన్నధాన్యానికి ఇస్తున్న మాదిరిగా దొడ్డు ధాన్యాన్ని కూడా బోనస్ ఇవ్వాలని మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సన్నధాన్యాన్ని సాగు చేస్తున్న రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయిస్తే సుమారు రూ.1000 నష్టం వాటిల్లు తుందన్నారు. అందువల్ల సన్నధాన్యాన్ని సాగు చేస్తున్న రైతులు రైస్ మిల్లర్లకు అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. దొడ్డు ధాన్యాన్ని సాగుచేసిన రైతులకు కూడా బోనస్ ఇచ్చినట్లయితే వారికి మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

ఐకేపీ విఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఐకెపి విఓఏలకు గ్రేడింగ్ తో సంబంధం లేకుండా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ఐకెపి విఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షులు మంత్రాల మంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలో ఎపియం కార్యాలయం ముందు దార్న చేసి ఎపియం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం విఓఏలకు రూ.26,000/-ల కనీస వేతనం అమలు చేయాలన్నారు. సెల్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10 లక్షలు సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి, ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చెశారు. గ్రామ సంఘం ఇవ్వాల్సి రూ.3,000లు ఇవ్వాలని,జీఓ నెం.580 సవరించాలని, విఓఏల 3 నెలల రెన్యువల్ పద్ధతిని రద్దు చేయాలని, గ్రామ సంఘానికి బకాయి ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్ వెంటనే చెల్లించి ప్రతి గ్రామ సంఘానికి ల్యాప్ ట్యాప్, నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులైన విపీలకు సిసిలుగా పదోన్నతి కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా ఐకెపి విఓఏలకు ఒకేరకమైన యునిఫాం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు యండి. రూమణ, పర్శరాములు, కవిత, విజయ, సామ్రాజ్యం, సునీత, లావణ్య, అనిత, జయమ్మ, పాల్గొన్నారు.

సరైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్ డిఎస్ చౌహాన్



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

సరైన తేమ శాతం (17శాతం కన్నా తక్కువ)తో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్ డిఎస్ చౌహాన్ అన్నారు. సోమవారం అయన నల్గొండ జిల్లా నార్కట్ పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యం కుప్పలను, తేమశాతాన్ని తేమ కొలిచే యంత్రం ద్వారా పరిశీలించారు. దొడ్డు రకం ,సన్నరకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా నార్కట్పల్లి ప్రాంతంలో మొత్తం దొడ్డు ధాన్యమే వస్తున్నదని సెంటర్ ఇన్చార్జి కమిషనర్ కు తెలియజేశారు. ధాన్యాన్ని గన్ని బ్యాగులలో తూకం వేసే గంట ముందు కుప్పలన్నింటిని ఆరబెట్టి పంపించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యాన్ని శుభ్రం చేసే యంత్రాలు, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అడగగా, 15 మంది రైతులు నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. చెల్లింపులు ఎలా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తీసుకుంటున్నది లేనిది కనుక్కున్నారు. అన్లోడ్ సమస్యలు, హమాలీలు, లారీల సమస్యలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ని ఆదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు జిల్లాలో ప్రతిరోజు ధాన్యం పంపిన వెంటనే ఆన్ రోడ్ చేసుకుంటున్నారని, ఎలాంటి సమస్యలు లేవని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సన్నధాన్యం కేంద్రాలు 80 పైగానే ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. మిల్లర్లతోపాటు, ప్రభుత్వం తరఫున సైతం ధాన్యాన్ని నిల్వ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలుపగా, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున సైతం ధాన్యాన్ని నిలువ చేసుకుంటున్నామని అన్నారు. గతంలో సీఎంఆర్ సకాలంలో చెల్లించిన మిల్లర్లందరికీ రొటేషన్ పద్ధతిలో సీఎంఆర్ ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలలో జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసేందుకు అవసరమైతే దాన్యం శుభ్రం చేసే యంత్రాలను కొనుగోలు చేయాలని కలెక్టర్ కు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ,అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్ ,జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు ,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ,డిసీఓ పత్యా నాయక్, తదితరులు ఉన్నారు.

విద్యుద్ఘాతంతో రైతు మృతి

నవతెలంగాణ-మాడుగులపల్లి

విద్యుద్ఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పెద్దదేవులపల్లి సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన కుంచెం సైదులు (45) నార్లకంటి గూడెంలో తన వ్యవసాయ పొలం దగ్గర నేలకొరిగిన పంటను లేపుతున్నాడు. ఈ క్రమంలో అతని కుడి చేయి ప్రమాదవశాత్తు కరెంటు వైర్ కు తగలడంతో విద్యుద్ఘాతానికి గురయ్యాడు. అక్కడే పని లో ఉన్న తన భార్య, చుట్టుపక్కల వారు కూడా రాగా అందరూ కలిసి సైదులు ను హాస్పిటల్ కు తరలించే క్రమంలో మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య అయిన కుంచెం లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సుకు తరలిన నాయకులు

నవతెలంగాణ-తిరుమలగిరి

తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలంటూ సోమవారం నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల ఉమ్మడి నల్గొండ జిల్లా సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న మంద కృష్ణ మాదిగ పాల్గొనే కార్యక్రమానికి మండల నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలి వెళ్లారు. వెళ్లినవారిలో ఎంఎస్పి ఉమ్మడి నల్గొండ జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమన్న, ఎంపీఎస్ జిల్లా కమిటీ నాయకులు పోతరాజు సురేష్, వీహెచ్పిఎస్ జిల్లా నాయకులు వేముల వెంకన్న, ఎమ్మార్పీఎస్ టౌన్ ఇన్చార్జి కందుకూరి మహేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కందుకూరి విష్ణు, మరియు కందుకూరి చంద్రయ్య, కందుకూరి రవి, కందుకూరి మల్లయ్య, కందుకూరి యాదగిరి, కపిల్, సింగర్ శీను, పేరాల జగన్, పత్తేపురం అరుణ్, నాయక్ మహేష్, సూరారపు ప్రవీణ్, భూపతి విగ్నేష్,పల్లెర్ల సురేష్, వెంకటేష్ చెరుకు గిరి, రవి ఉన్నారు.



సమగ్ర కుల సర్వే పై టాంటాం వేయించాలి

నవతెలంగాణ-హాలియా

ఈనెల 6 నుండి చేపట్టనున్న సామాజిక ,ఆర్థిక, విద్య ,ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై టామ్ టామ్ వేయించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.సోమవారం ఆమె నల్గొండ జిల్లా, హలియా మున్సిపాలిటీలో సామాజిక ,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు.సర్వే పట్ల ఎన్యుమరేటర్లు నిర్లక్ష్యంగా ఉండవద్దని, పూర్తి జాగ్రత్తగా వివరాలు సేకరించాలని కలెక్టర్ అన్నారు. కేటాయించిన ప్రతి ఇంటి నుండి వివరాలు సేకరించాలని, సర్వేకి వెళ్లిన సమయంలో ఒకవేళ ఎవరైనా ఇంట్లో లేనట్లయితే మరోసారి ఆ ఇల్లును సందర్శించాలని, వివరాలు సేకరించిన తర్వాత ఇండ్లకు స్టిక్కర్ అతికించాలని చెప్పారు. ఈ సర్వే కేవలం రాష్ట్రంలో సమాచార నిమిత్తం ,ప్రస్తుత పరిస్థితిని తెలుసుకునేందుకు మాత్రమే అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సర్వే ఫారాలలోని ఖాళీలను ఎలా పూరించాలో తెలియజేయడమే కాకుండా ప్రశ్నావలి పై ఎన్యుమరేటర్లకు వివరంగా తెలియజేశారు. కార్యక్రమంలో హలియా మున్సిపల్ కమిషనర్ రామ్ దుర్గారెడ్డి ,మండల ప్రత్యేక అధికారి బిక్షపతి ఉన్నారు.

'సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి '

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేకు మొదటి ఫేజ్లో 6 నుంచి 9వ తేదీ వరకు ఎన్యూమరేటర్లు వారివారి పరిధిలోని ప్రాంతాల్లో ఇంటింటికి నెంబరింగ్ చేస్తారని అన్నారు. రెండవ దశలో 10వ తేదీ నుంచి కుటుంబం వారీగా వివరాలను నమోదు చేస్తారని అన్నారు. ఎన్యూమరేటర్లు నమోదు చేసి వివరాలను వెంటనే కంప్యూటర్లలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. నవంబర్ చివరి వరకు లేదా డిసెంబర్ మొదటి వారంలోగా సర్వేను పూర్తి చేసేలా సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగిందని అన్నారు. డివిజన్లో వివిధ మండలాల పరిధిలోని గ్రామాల్లో 80 రేషన్ దుకాణాల నిర్వహణకు డీలర్ల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. మిర్యాలగూడ మండలం కిష్టాపురం(ఎస్టీ), రాయినిపాలెం (ఓసీ), జంకుతండా (ఎస్టీ), సీత్యాతండా (ఎస్టీ), పట్టంలోని బాపూజీనగర్(ఓసీ), గజలాపురం (బీసీ), కన్నెకల్(ఓసీ), అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల(ఓసీ), నిడమనూరు మండలం బంకాపురం(ఓసీ), మార్తివారిగూడెం(బీసీ మహిళ), అనుముల మండలం పాలెం(ఓసీ), అల్వాల (బీసీ మహిళ), జమ్మనకోట(ఎస్టీ), తిరుమలగిరి(సాగర్) మండలం తిరుమలగిరి2 (ఓసీ), గంటారావు క్యాంపు (ఓసీ, బడాయిగడ్డ (ఎస్టీ), వస్రాంతండా (ఎస్టీ), త్రిపురారం 2 (బీసీ), కంపసాగర్(ఓసీ), కంపసాగర్(ఓసీ), వేములపల్లి మండలం రావులపెంట(ఓసీ), తిమ్మారెడ్డిగూడెం(ఎస్టీ), దామరచర్ల మండలం కొండ్రపోల్(ఓసీ), పర్తునాయక్తండా (ఎస్టీ) 8వ తేదీ నుంచి 18వరకు రిజర్వ్ డీలర్స్ పోస్టులకు ఆయా గ్రామాలకు చెందిన 18-40 సంవత్సరాల వారు మాత్రమే వారి మండలాల్లో రూ.250 రుసుము చెల్లించి అప్లయ్ చేసుకోవాలన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. 80 మార్కుల రాత పరీక్షలో 32 మార్కులకు పైగా సాధించిన వారికి ఒక్కో డీలర్ పోస్టుకు 1:5 చొప్పున పిలిచి 20 మార్కులకు ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'దళారులను నమ్మి మోసపోవద్దు'

నవ తెలంగాణ-చింతలపాలెం

దళారులను నమ్మి మోసపోవద్దని హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని భారతమ్మ కాటన్ మిల్లులో సోమవారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని రైతులు అందరూ తమ పత్తిని అమ్ముకోవలసి వస్తే పత్తి కొనుగోలు కేంద్రానికి తీసుకోని రావాలని, పత్తిలో తేమ శాతం 8 నుండి 12 వరకు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తి కొనుగోలు అధికారి దినేష్ టెలి, భారతమ్మ కాటన్ మిల్లు యజమాని కాకునూరి రామ్ రెడ్డి, కాంగ్రెసు పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ ఇంద్రారెడ్డి, రైతులు పిచ్చిరెడ్డి, శంబిరెడ్డి, రామరావు, తదితరులు ఉన్నారు.

సింగారెడ్డిపాలెం వివోఏగా గీత ఎన్నిక

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండల పరిధిలోని సింగారెడ్డి పాలెం చెందిన 35 సమభావన సంఘాల అధ్యక్షురాల్లు గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్‌గా పెర్ల గీతను సోమవారం ఏపీఎం అజయ్ నాయక్, శ్రీనిధి మేనేజర్ జ్యోతి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామంలో 45 సంఘాలు ఉండగా సమావేశమునకు 35 సంఘాల అధ్యక్షురాల్లు హాజరైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్యాబ్ ఆపరేటర్ స్వరూప, సంఘ బంధం అధ్యక్షురాలు రావి శైలజ, ఉపాధ్యక్షురాలు కంచర్ల లలిత, కార్యదర్శి రౌతు శాంతమ్మ కోశాధికారి గుణగంటి చంద్రకళ, 35 సమభావన సంఘాల అధ్యక్షురాల్లుఉన్నారు. అయితే గతంలో విఓఏగా నూతనంగా ఎన్నికైన గీత భర్త గణేష్ విఓఏగా కొనసాగేవాడు.

వైభవంగా ప్రారంభమైన కార్తీక మాస ఉత్సవాలు

నవతెలంగాణ-హుజూర్ నగర్

పట్టణంలోని భీమ లింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్బంగా కార్తీక మాస ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్ల ను చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి ఆలయ అర్చకులు రెంటాల రవి శర్మ దేవులపల్లి సుబ్రహ్మణ్య శర్మ కితా మల్లికార్జున్ చిన్నం సురేష్ కంచర్ల అరవింద్ రెడ్డి క్రాంతి రెడ్డి పాల్గొన్నారు.

ధర్మయుద్ధ సన్నాహక సభకు తరలిన నాయకులు

నవతెలంగాణ-కోదాడరూరల్

నల్గొండలో నిర్వహించిన ధర్మయుద్ధ సన్నాహకసభ సమావేశానికి మండల పరిధిలోని గణపవరం గ్రామానికి చెందిన ఎంఆర్పిఎస్ నాయకులు సోమవారం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. తరలిన వారిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పెడమర్తి చిన్న వెంకటరావు, గ్రామ అధ్యక్షులు పెడమర్తి సతీష్ , బలుగూరి సైదులు, పిడమర్తి కిషోర్, పిడమర్తి పుల్లయ్య, పిడమర్తి తేజ ,బండి గోపి, కస్తాల వేణు, పెడమర్తి రవి, బట్ట గౌతం ఉన్నారు.

ఎస్సారెస్పీ కాలువకు బీఎన్ రెడ్డి నామకరణం చేయాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

ఎస్సారెస్పీ కాలువకు బియన్ రెడ్డి పేరును నామకరణం చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మందుల సామేలుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తిరుమలగిరి ఎక్స్ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు రావాలని పోరాడి సాధించిన వ్యక్తి బి.యన్ రెడ్డి అన్నారు. కావున ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ఈ కాల్వకు బి.యన్.రెడ్డి పేరు నామకరణం చేయాలని ఈ కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి, యాదవ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చెవిటి వెంకన్న యాదవ్‌కు సన్మానం

నవతెలంగాణ-తిరుమలగిరి

తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులుగా నియమితులైన డిసిసి అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్సొజు నరేష్, టౌన్ అధ్యక్షుడు పేరాల వీరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మీలాల్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గొడిశాల అంజి గౌడ్‌లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా దేవయ్య

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామానికి చెందిన ఒగ్గు దేవయ్య మాదిగను టీఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఒగ్గు దేవయ్య మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం నా ప్రాణం ఉన్నంతవరకు పోరాటం చేస్తానని ఆయన అన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన టిఎంఆర్పిఎస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాషపంగు సత్యం, జిల్లా కార్యదర్శి మామిడి సైదులు, ఒగ్గు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గ్రీన్ గ్రోవ్ విద్యార్థి అఖిల్ నందన్ ఎంపిక

నవతెలంగాణ-చిట్యాల



మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కట్ట అఖిల్ నందన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబర్ 29న నలగొండ జిల్లా కేంద్రంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియం లో నిర్వహించిన క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి అఖిల్ నందన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు . అఖిల్ నందన్ నవంబర్ 5, 6, 7, తేదీలలో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లా తరఫున రాష్ట్రస్థాయికి ఎన్నిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి, పాఠశాల ఏవో పోల గోవర్ధన్ , వ్యాయామ ఉపాధ్యాయుడు గంగాపురం రాము, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అఖిల్ నందన్ ను అభినందించారు.

ఇంటింటి సర్వేను పగడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ - పెద్దవూర

ఈ నెల 6 నుంచి మండలంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఏంపీడీఓ ఉమాదేవీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉపాధ్యాయులకు ఇంటింటి సర్వే పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. మాస్టర్ ట్రైనర్లు అన్ని అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ పావని,ఏఓ సందీప్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి,ఎంఎస్ఓ సైదానాయక్,మాస్టర్ ట్రైనర్ దిరావత్ బాలు,ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

చండూరు : మండలంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు మండల ప్రజలు సహకరించాలని ఎంపీడీవో రాంరెడ్డి కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కుటుంబ సర్వేపై మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లకు, ప్రభుత్వ టీచర్లకు, అంగన్వాడి టీచర్లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యమం లో ఆయన మాట్లాడుతూ శిక్షణ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు అన్ని అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్లు ప్రభుత్వ టీచర్లు , ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చండూరు

సగర సంఘం జిల్లా అధ్యక్షునిగా రవికుమార్ సాగర్

నవతెలంగాణ-చండూరు

సగర సంఘం జిల్లా అధ్యక్షునిగా నేర్లకంటి రవికుమార్ సాగర్ ,ప్రధాన కార్యదర్శిగా బల్గురి కరుణాకర్ సాగర్ , కోశాధికారిగా కోలుగూరి ప్రవీణ్ సాగర్ ఆదివారం మున్సిపల్ పట్టణంలో సగర సంఘం అధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల సగరులు తమ ఓట్ల ద్వారా జిల్లా సగర సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నేర్లకంటి రవికుమార్ సాగర్ మాట్లాడుతూ తనకు ఓటు వేసి నా జాతికి సేవ చేసే భాగ్యం కల్పించిన జిల్లా సగర బంధువులందరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్ ఆధ్వర్యంలో జాతిని వెలుగులోకి తీసుకురావడానికి జిల్లానుండి బలంగా పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సాగర్,రాష్ట్ర గౌరవ సలహాదారు ఆర్. బి ఆంజనేయులు సాగర్,సీనియర్ నాయకులు రూక సత్యానారాయణ సాగర్, రాష్ట్ర మహిళా నాయకురాలు కోలుగురి అమృతా సాగర్, నాయకులు కళ్లెట్ల మారయ్య సాగర్, లక్ష్మణ్ సాగర్, రామకృష్ణ సాగర్,సుధాకర్ సాగర్,వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శి కోశాధికారుల తో పాటు భారీ ఎత్తున జిల్లా నలుమూలల నుండి సగరులు పాల్గొన్నారు.



16న సీపీఐ(ఎం) మండల మహాసభ

నవతెలంగాణ-నిడమానూరు

ఈనెల 16న మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సీపీఐ(ఎం) మండల 8వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ కోరారు. సోమవారం మండలకేంద్రంలో కరపత్రం వారు విడుదల చేసి మాట్లాడారు. మండలంలో ప్రజా సమస్యలను గుర్తించి, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామనితెలిపారు. గత మూడు సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకొని నూతన కమిటీని ఎన్నుకోనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొండేటి సామంతు,తోటపల్లి బాల నారాయణ, వింజమూరు శివ, వింజమూరి పుల్లయ్య,కొండేటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వివోఏ ల సమస్యలు పరిష్కరించాలి

- **సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య**

నవతెలంగాణ-మర్రిగూడ

ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించి,ఏపీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి,ఉద్యోగ భద్రతతో పాటు10 లక్షలు సాధారణ బీమా,ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించి ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శు గంట మంజుల,పద్మ,అయితగోని సరిత, మహేష్,భీమనపల్లి భారతమ్మ,కడారి యాదమ్మ,బుగ్గ రాములు,విజయమ్మ,తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) చిట్యాల అన్ని గ్రామ శాఖల కార్యదర్శులు వీరే

నవతెలంగాణ- చిట్యాల

మండలంలో ఇటీవల జరిగిన సీపీఐ(ఎం) గ్రామ శాఖల మహాసభలలో నూతనంగా ఎంపికైన పార్టీ గ్రామ శాఖ కార్యదర్శుల పేర్లను ఆ పార్టీ మండల కార్యదర్శి అరూరి శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిట్టంపల్లిలో బాతరాజు గోపాలు, వెలిమినేడు-1 నాతి వెంకట్రామయ్య, వెలిమినేడు-2 అరూరి దుర్గయ్య, వెలిమినేడు-3 సుర్కంటి మోహన్ రెడ్డి, గుండ్రాంపల్లి కత్తుల యాదయ్య, సుంకెనపల్లి పంతంగి నర్సింహా చారి, చిన్న కాపర్తి వీరమళ్ళ వెంకన్న, ఆరెగూడెం మెట్టు తిరుమలయ్య, ఉరుమడ్ల బెలిజ మల్లయ్య, ఎలికట్టె గోపగోని వెంకన్న, తాళ్ళవెల్లంల పామనుగుళ్ళ దశరథ, నేరడ కందగట్ల గణేష్, వనిపాకల గునగంటి కృష్ణయ్య, వట్టిమర్తి బూర్గు శ్రీను, ఏపూరు ఎర్రసాని పరమేష్, పేరేపల్లి అంతటి యాదయ్య, పెద్ద కాపర్తి కొత్త మీనయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.



సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- **ఆక్రమ అరెస్టులు నశించాలి**

నవతెలంగాణ భూదాన్ పోచంపల్లి

సర్పంచుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని సర్పంచ్లు శాంతియుతంగా ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడం తగదని పలువురు సర్పంచులు అన్నారు సోమవారం.హైదరాబాద్ సర్పంచుల పోరుబాట కార్ర్యమానికి వెళ్లకుండా హైదరాబాద్‌లో సర్పంచులను అరెస్టు చేసి హైదరాబాద్‌లో ఎన్ని పోలీస్‌స్టేషన్లు ఉన్నాయో అన్ని పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారు.భేగం బజార్ లోని షాహి నాయత్ గంజ్ పోలిస్టేషన్‌కు తరలించారు.వరంగల్, సంఘారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల సర్పంచులు ఈ స్టేషన్లలో ఉన్నారు.సర్పంచుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుత ధర్నా కార్యక్రమానికి హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో పెద్దమ్మ గుడి దగ్గర వేదికకు వెళ్లకుండా అక్రమఘ అరెస్టు చేయడం ప్రభుత్వ దిగజారుడు తనమన్నారు.రాష్ట్రంలో సీఎం పాలన జరుగుతుందా? పోలీస్ పాలన జరుగుతుందా అనేది అర్థం కావడం లేదన్నారు. సర్పంచులపెండింగ్ బిల్లు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎలక్షన్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పద్మారెడ్డి, ప్రభాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులుగా మైలారం శివప్రసాద్, దయ్యాల మల్లేశ్

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్





డీవైఎఫ్ఐ భువనగిరి మండల అధ్యక్ష కార్యదర్శులుగా మైలారం శివప్రసాద్, దయ్యాల మల్లేష్‌లను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ తెలిపారు. ఆదివారం జరిగిన మండల మహాసభలో డీవైఎఫ్ఐ అభివృద్ధి కోసం యువత ఉపాధి అవకాశాల కోసం స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు.భవిష్యత్‌లో అనేక పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి దయ్యాల మల్లేశం, మండల ఉపాధ్యక్షులుగా కుసుమమధు, గడ్డం కనకరాజు, సహాయ కార్యదర్శులుగా పల్లెర్ల వినోద్, చందుపట్ల భిక్షపతి, కమిటీ సభ్యులుగా జాన సురేష్,ముదుగులశేఖర్, గడ్డం చాణక్యలను ఎన్నుకున్నారు.

'కొర్రీలు పెట్టకుండా ధాన్యం తీసుకోవాలి'

నవతెలంగాణ-రాజపేట



నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ మండల శాఖ కార్యదర్శి చిగుళ్ల లింగం కోరారు. రాజపేట మండలం బేగంపేట గ్రామస్తుల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యాన్నిఐకేపీ సెంటర్లలో ఆరబెట్టి తేమశాతం 15 రావాలని నిబంధన పెట్టారని, మండలంలో ఇంచుమించుగా అన్ని గ్రామాల ఐకేపీ సెంటర్లలో ధాన్యం గలగల ఎండినట్టుగా రైతు సంఘం ప్రతినిధులను పరిశీలించగా ఐకేపీ సెంటర్ అధికారులు మ్యాచరు ఇంకా సరిగా లేదని కొర్రీలు పెడుతున్నారన్నారు. రైతుల ధాన్యాన్ని లారీలలో లోడ్ చేసి రైస్ మిల్లులకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లూరి రాజయ్య కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం, మూల అరుణాలు,ఒగ్గు కర్నాకర్, మూల పోశయ్య, కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.

6న సీపీఐ(ఎం) చౌటుప్పల్ మండలమహాసభ

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

సీపీఐ(ఎం) చౌటుప్పల్ మండలమహాసభ 6 న చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామ పరిధిలో రాయల్ గార్డెన్ లో నిర్వహిస్తున్న మండల 8వ మహాసభకు పార్టీ సభ్యులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గంగాదేవి సైదులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.మండల కార్యదర్శి వర్గ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

నవతెలంగాణ-బొమ్మలరామారం

చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని జయశ్రీ గార్డెన్స్‌లో ఈనెల 12న జరిగే ఏఐటీయూసీ జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ కోరారు. సోమవారం మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అన్నేమైన వెంకటేష్, బీసీ హక్కుల సాధన సమితి అధ్యక్షులు కైరంకొండ ఆనంద్, ఏఐటీయూసీ నాయకులు ఉట్లకృష్ణ, గుండు వెంకటేష్, యాట మౌనిక, బొమ్మరం సంధ్య, ఎం.రాజు, మల్లేష్, జె.బాలరాజు, ఎం.మహేష్ పాల్గొన్నారు.



యుద్ధభేరికి బయల్దేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-రాజపేట

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయకుండా మాదిగ జాతిని మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి మోసాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల ధర్మ యుద్ధ ఉమ్మడి నల్లగొండ జిల్లా మహాసభకు సోమవారం రాజపేట నుండి ఆ సంఘం నాయకులు సోమవారం బయల్దేరారు.తరలి వెళ్లిన వారిలో ఆ సంఘం మండల అధ్యక్షులు మోత్కుపల్లి నవీన్‌కుమార్, ఎంఈఎఫ్ జిల్లా ఇన్‌చార్జి ఇంజ మహేష్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ నాయకులు కోయ బాలరాజు, మండల నాయకులు గంధమలసురేష్, భూపతి బాలకిషన్, సిరిపంగ గణేష్, పాముకుంట గ్రామశాఖ అధ్యక్షులు రఘుపతి నరేష్,ప్రధాన కార్యదర్శి వెంకటాపురం ప్రవీణ్, బడే రజినీకాంత్, వెంకటాపురం శేఖర్, దుబ్బాసిదయాకర్ ప్రకాష్, దుబ్బాసి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవొద్దు

- **భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కనుకుంట్ల రేఖ**

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవొద్దని భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కనుకుంట్ల రేఖ బాబురావు సూచించారు. సోమవారం ఆమె భువనగిరి మండలం రెడ్డినాయక్‌తండాలోని ఐకేపీ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజల కోసం రైతుల కోసం పనిచేస్తుందన్నారు.సకాలంలో వడ్లు కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందికి ఇక్కడికి ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చిన్నం శ్రీనివాస్, పిట్టల రజిత, తాడూరి నర్సింహ, ఏపీఎం అంజయ్య, సీసీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్, మాజీ సర్పంచ్ మంజునాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు తనకుంట్ల కొండల్, కొండమడుగుఅశోక్, గ్రామ శాఖ అధ్యక్షులు రఘునాయక్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌నాయక్, సక్రునాయక్, మాద సత్యనారాయణ పిట్టల వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.





మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-వలిగొండ

మండలకేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన మాధగోని అంజమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.ఆమె కుటుంబానికి కాంగ్రెస్ నాయ కులు కొండూరు భాస్కర్‌గౌడ్ రూ.5వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. ఈకార్యక్రమంలో గరిసెరవి, బత్తినిపాండు, ఎంఎస్.గౌడ్, కుర్షిత్, మైసోళ్లవెంకటేశ్, సోమేశ్,ప్రవీణ్, సాయి,ఉపేందర్, దుర్గా, బాలనర్సింహ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో ఐకేపీ కొనుగోలుకేంద్రాన్ని భువనగిరి మాజీఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు.వర్షాలు కురుస్తున్నందున సరైన జాగ్రత్తలు తీసుకోవా లన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం శారాజీపేట గ్రామానికి చెందిన దూడల ఉదయ్ దీపావళి పండుగ రోజున గ్రామంలో ఇంటి వద్ద, ఇంటిపై లైట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతమై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ సోమవారం ఉదయ్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు . ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రచ్చ రామ్ నరసయ్య,మొరిగాడి అశోక్, మాజీ ఉపసర్పంచ్ కంతి మహేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు మహేందర్, గ్రామశాఖ కార్యదర్శి శ్రీధర్, అశోక్, నీరటి రాంనర్సయ్య,గౌడ సంఘం అధ్యక్షులులక్ష్మణ్, సిద్ధులు,స్వామి శ్రీను పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల జీవన ప్రమాణ పత్రం అప్‌లోడ్

నవతెలంగాణ-భువనగిరి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో సర్వీస్ చేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షన్‌దారులను ఆహ్వానించి టీఏపీస్పీఏ యాదాద్రి భువనగిరి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో జీవిత ధ్రువీకరణపత్రాలను సోమవారం అప్‌లోడ్ చేయించారు.పోస్టాఫీస్ కార్యాలయం నుండి అధికారులు కడారి శ్రీనాథ్, బానోతుసునీత, మాలోత్ సునీల్‌కుమార్ ద్వారా సుమారుగా 60 మంది పెన్షన్‌దారులు తమ జీవన ప్రమాణపత్రాలను అప్‌లోడ్ చేయించు కున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం, ఉపాధ్యక్షులు సాధినేనిదశరథ, కోశాధికారి దర్గా నర్సింగరావు, సంయుక్త కార్యదర్శి బండారు భిక్షపతిరెడ్డి, ,పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

కులగణనలో మాదిగలు అప్రమత్తతతో ఉండాలి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



కులగణనలో మాది గలు అప్రమత్తతో ఉండాలని భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మెన్ బర్రె జహంగీర్ అన్నారు. సోమవారం దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో యాదాద్రి కలెక్టర్ హనుమం తరావుకు వినతి పత్రం అందజేశారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించే ఎన్యూమరేటర్స్ సర్వే ఫార్మెట్‌లోని అన్ని కాలాలను సక్రమంగా నింపే విధంగా ముఖ్యంగా కులం పేరును అడిగి ఆయా కులాలకు సూచించిన కోడ్‌ను, అన్ని వివరాలు సరిగ్గా నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.సర్వేలో తప్పులులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్యుమరేటర్ నింపిన సర్వే ఫార్మాట్‌ను కుటుంబ సభ్యులు చూసుకునే అవకాశం సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు.ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక జిల్లాఅధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికల దేవేందర్‌మాదిగ, పట్టణ అధ్యక్షులు పడిగల ప్రదీప్ పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణా తరగతులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండల పరిధిలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో సోమవారం సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ,కుల సర్వే కు సంబంధించి సూపర్వై జర్లు ఎన్యుమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకఅధికారి, ఎంపీ డీవో, ఎంఈఓ,ఎంపీఓ, టీఓటీ, ఎంపీ ఎస్ఓ, సూపర్వైజర్ ఆఫీసర్లు, ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.



మోటార్‌సైకిల్ పై నుండి పడి యువకుడు మృతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

మోటార్‌సైకిల్ పై నుండి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని టంగుటూరు రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రజినికర్ తెలిపిన వివరాల ప్రకారం..టంగుటూరు నుండి ఆలేరు వైపుకు వస్తున్న పట్టణానికి చెందిన రాపోలు రవితేజ, మరొక స్నేహితులతో కలిసి వస్తుండగా మోటార్‌సైకిల్ స్కిడ్ అయి కింద అక్కడికక్కడే మృతి చెందాడు.కాగా అతని స్నేహితునికి తీవ్ర గాయాలు కాగాచికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల కార్మికుల అవగాహనా సదస్సులు

నవతెలంగాణ-భువనగిరి

దేశవ్యాప్తంగా బాల కార్మిక నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి తెలిపారు. సోమవారంజిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన, రక్షణ, పునరావాసం అవగాహన, కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం అంతటా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు, బాల కార్మికుల గుర్తింపు, వారి రక్షణ మరియు పునరావాసంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పై కార్యాక్రమాలపై సంబంధిత జిల్లా శాఖలతో సమావేశం నిర్వహించి తగు సూచనలు చేసినట్లు తెలిపి బాల కార్మిక నిషేధ చట్టం, శిక్షలు వాటి పర్యవసానంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్స్ లీగల్ లీటరసీ క్లబ్ ను సందర్శించి చైతన్యవంతంగా ఈ క్లబ్ నిర్వహణకు విద్యార్థులకు తగు సూచనలు చేసారు. సి. డబ్ల్యూ. సి అధ్యక్షులు బి. జయశ్రీ మాట్లాడుతూ బాలలను పనికి వినియోగించినట్లయితే రేపటి సమాజానికి ద్రోహం చేసినట్లేనని, బడికి వెళ్ళాల్సిన బాలలను వివిధ రకాలుగా వినియోగిస్తూ , బాల్య వివాహాలు కూడా చేయటం అనాగరికమన్నారు. భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు హరినాథ్ మాట్లాడుతూ తమ న్యాయవాదులు న్యాయ సేవ సంస్థకు ప్యానల్ న్యాయవాదులుగా న్యాయ సేవలను అందచేస్తున్నారన్నారు.15190 న్యాయ సహాయంపై టోల్ ఫ్రీ నెంబర్ అవగాహన పోస్టరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలలపరిరక్షణ అధికారి సైదులు,కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి,కొలుపుల వివేకానంద, న్యాయ సహాయ న్యాయవాదులు ఎస్.జైపాల్, జి. శంకర్, పిఎల్‌వి రాంబాయి, శ్రీశైలం పాల్గొన్నారు.





రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ బీసీ గురుకుల విద్యాలయానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం విద్యార్థులను ఆయన అభినందించి మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న భువనగిరిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 విభాగంలో తమ పాఠశాల చెందిన ప్రేమ్ కుమార్ పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, అండర్ 17 విభాగంలో శ్రీకాంత్ హై జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి, అండర్ 17 విభాగంలో కోకో క్రీడలో అనిల్ ద్వితీయ స్థానము సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పి డి లు జ్యోతి, అరుణ పీ ఈ టి నరసింహ తదితరులు ఉన్నారు.

ఎన్యుమరేటర్లకు,సూపర్‌వైజర్లకు శిక్షణ

నవతెలంగాణ-మర్రిగూడ



సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ బి వేణుగోపాల్ మాట్లాడుతూ ఎలాంటి తప్పులు లేకుండా సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, ఎంపీఓ రవికుమార్, ఏపీఎం ప్రభాకర్, ఏపీవో, ఆర్డబ్ల్యూఎస్ ఏఇ వెంకటేశ్, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

బీఎల్ఆర్‌ను విమర్శించడం సరికాదు

- గుండు నరేందర్

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పై తీర్మానం మల్లన్న వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల నాయకులు గుండు నరేందర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిర్యాలగూడలో నిర్వహించిన బిసి గర్జన సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బీసీ కులాల ఐక్యత గురించి నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి, శాసనసభ్యుల గురించి మాట్లాడడం వారిని విమర్శించడం సబబు కాదన్నారు. కాంగ్రెస్‌లో ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేస్తూ పార్టీ నాయకులను విమర్శించడం ఏంటి..? నీకు ఆ పదవి గౌరవం దక్కింది అంటే అది కాంగ్రెస్ బిక్షే అని మరిచిపోకూడదన్నారు. గెలుపులో స్థానిక ఎమ్మెల్యే బీఎల్ఆర్ కృషి ఎంత ఉందో.. ఆనాడు ఫలితాలు వచ్చాక మీరు స్వయంగా మీడియా ముఖంగా తెలిపిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు షేక్ జిందా, బెజ్జం సాయి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

నవతెలంగాణ-హాలియా

పంచారామ క్షేత్రలకు నల్గొండ నుండి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు హాలియా బస్టాండ్ కంట్రోలర్ సంపత్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పంచారమా క్షేత్రాల బస్సు సౌకర్యం వివరాల గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 3న 10న 17న డీలాక్స్ బస్సు నల్గొండ నుండి రాత్రి 8గంటలకు బయల్దేరి పంచారమా క్షేత్రలు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట వెళ్ళనున్నట్లు పేర్కొన్నారు. పెద్దలకు రూ. 2వేలు పిల్లలకు రూ. 13 వందలు ఛార్జి నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో నరహరి శ్రీనివాస్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలలో సిరులు కురవాలి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

మత్స్యకారుల కుటుంబాలలో సిరులు కురవాలని జిల్లా మత్స్యశాఖ అధికారిని చరిత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. 2024 - 25 సంవత్సరానికి గాను నల్లగొండ జిల్లాలోని చర్లపల్లిలో గల భీమా సముద్రంలో 3.61 లక్షల ఉచిత చేప పిల్లలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ ఈ ఏడాది భారీ వర్షాలకు జలాశయాలు, చెరువులు, నీటివనరులన్నీ జలకళ సంతరించుకున్నాయని అన్నారు. ప్రతి గ్రామంలో ఎక్కడైతే చెరువులు ఉంటే అక్కడ ఉచిత చేపపిల్లల పంపిణీ చేయాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. అందులో భాగంగానే చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇది మత్స్యకారుల కుటుంబాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, ఏర్పుల రవి, మత్స్యశాఖ సూపర్డెంట్ శ్రీనివాస్, మత్స్య పారిశ్రామిక శాఖ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లను అరికట్టాలని వినతి

నవతెలంగాణ-హాలియా



అక్రమ డిప్యూటేషన్లను అరికట్టాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక హాలియా డిప్యూటీ తహసీల్దార్ రఘుకు, ఆర్ఐకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నల్లవెల్లి జగదీష్, కోరే రమేష్ మాట్లాడుతూ...నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను అవసరం ఉన్న పాఠశాలను కాదని చెప్పి అక్కడ విద్యార్థులు ఉన్న తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో ఇష్టానుసారంగా డిప్యూటేషన్లు ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కారణం అవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు విద్యను కోల్పోయే ప్రమాదంలో పడి సబ్జెక్టు సంబంధించిన టీచర్లు లేక పేద మధ్యతరగతి విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపేసే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు గోపి, శివరాం, వరప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రమాణాలు నైపుణ్యాల పెంపునకు అదనపు కోర్సుల అవసరం

- ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



విద్య ప్రమాణాలు నైపుణ్యాల పెంపునకు అదనపు కోర్సుల అవసరం. అని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం ఉపకులపతి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అన్ని శాఖ అధిపతులు , బి ఓ ఎస్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు, విధిగా హాజరు ప్రమాణాలు పాటిస్తూ, ఆల్మనాక్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. సాయంత్రం ఐదు గంటల నుండి 6 గంటల వరకు అదనంగా ఈ నైపుణ్య శిక్షణలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధపరచాలని సూచించారు. ప్రతి పక్షం రోజులకో మారు నిపుణులను ఆహ్వానించి తరగతులను ఆంపి థియేటర్ వేదికగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ ఆచార్య అలువాల రవి, ఓ ఎస్ డి ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఆచార్య ఆకుల రవి, డా మిరియాల రమేష్, డా ఉపేందర్ రెడ్డి, డా శ్రీదేవి, కే అరుణప్రియ, సుధారాణి , మాధురి, రూప, తిరుమల, దోమల రమేష్, రామచందర్ గౌడ్, హరీష్ కుమార్ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

నాగయ్య కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ మండలం, అవంతిపురం గ్రామానికి చెందిన ప్రెస్ ఫొటో గ్రాఫర్ పొడిశెట్టి నాగయ్య కుటుంబానికి కే,50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం అనంతపురంలో జరిగిన సంతాప సభలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలగడప 1990-91 ఎస్ సీసీ బ్యాచ్ మిత్ర బృందం సహకారం తో 50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాగయ్య కుటుంబ సభ్యులని పరామర్శించి నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు . ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ మండల అధ్యక్షులు మట్లపల్లి సైదులు యాదవ్, మంద సైదులు, ఆదిమల్ల లక్ష్మణ్, పూసపాటి శ్రీనివాస్, కందుల సైదులు, ఎండి షఫీ, కుక్కనూరి వెంకన్న , గుండ్రెడ్డి బుచ్చిరెడ్డి, ఇంద్రపల్లి ఆనంద్ బాబు, ఇంద్రపల్లి గురవయ్య, కోమటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కులగణనను వ్యతిరేకించే పార్టీలకు రాజకీయ సమాధి తప్పదు

నవతెలంగాణ-రాజపేట

ప్రభుత్వం ఈనెల 6 నుండి 20వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కులగణనను వ్యతిరేకించే పార్టీలకు రాజకీయ సమాధి తప్పదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తి హెచ్చరించారు. కులగనణనను వ్యతిరేకించే పార్టీలను బీసీ ద్రోహులుగా ప్రకటించి ఆయా పార్టీలను రాజకీయ సమాధి చేయడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపడుతున్న చారిత్రాక నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో కులసంఘాల నేతలు సుధాకర్, బైరుపాండు, మాపు భాస్కర్, రవి, బాబు పాల్గొన్నారు.



గృహప్రవేశానికి పలువురు నాయకుల హాజరు

నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన మండల మాజీ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి సోమవారం పలువురు నాయకులు హాజరైనారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దంటు జగదీశ్వర్,మాజీ ఎంపీపీ రాజు గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగం గౌడ్, పీఏసీఎస్ చైర్మెన్ పందుల యాదయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ, నామపురం మాజీ ఎంపీటీసీ ఊరుపక్క సరిత నగేష్, వెంకట రాంరెడ్డి నగేష్, నరసింహ, కొంపల్లి నాగరాజు, సుంకరి మల్లేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జెన్కో ఎస్ఐ నాగేశ్వరరావు సేవలు అభినందనీయం

- అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎస్ రెడ్డి

నవతెలంగాణ-నాగార్జునసాగర్

వృత్తిపట్ల బాధ్యత అంకితభావంతో ఉన్నతాధికారుల పట్ల విధేయతగా కలిగి ఉన్నటువంటి ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వహించిన సంతృప్తికరమైన జీవితం గడుపుతారని నాగార్జునసాగర్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం ఎస్ రెడ్డి అన్నారు. సోమవారం నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ ఎస్ పి ఎఫ్ ఎస్ఐ నాగేశ్వరరావు బదిలీ పై బేగంపేట విమానాశ్రయానికి వెళ్తున్న సందర్భంగా పైలాన్ ఎస్పీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి బదిలీలు సహజం అని ఉద్యోగి విధులు నిర్వహించిన చోట ప్రజల మన్ననలు పొందాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎస్సై నాగేశ్వరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెన్కో సీఐ ప్రతాప్ నాయుడు, ఎస్సై రఘుబాబు,ఏ ఎస్ఐ లు పుల్లయ్య,మహమ్మద్,జెన్కో ఏఎస్ఐ లు శ్రీను,అంబు,డిడి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుక్కలా బెడద నుంచి రక్షించాలి

నవతెలంగాణ -మిర్యాలగూడరూరల్

మిర్యాలగూడ మునిసిపాలిటీ 48వ వార్డుల్లో కుక్కల కాటుకు ప్రజలు గురవుతున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కు వినతిపత్రం సోమవారం సమర్పించామని ఆ వార్డు కౌన్సిలర్ పందిరి అనిత తెలిపారు. చేతిలో కర్ర లేకుండా బయటకు వెళ్లే పరిస్తితి లేదని ఆమె అన్నారు. ఆదివారం ముగ్గురిని కుక్కలు కరిచాయని ఆమె తెలిపారు. ఎన్నో మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో, నేరుగా కమిషనర్ ను కలసి కోరగా నేటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె తెలిపారు. భయాందోళనకు గురవుతున్న తమ వార్డు ప్రజలకు భద్రత కల్పించాలని ఆమె కోరారు. ఆమె వెంట టిడిపి నాయకులు అనంతాచారి తదితరులు పాల్గొన్నారు.